
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 125 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం,నవంబర్,6,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 125 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday,November,6,2025 | PAGES : 8 RS : 4 /- |

## అమెరికాలో ఘోర విమాన ప్రమాదం

**టేకాఫ్‌లోనే కుప్పకూలిన ఫ్లైట్, ముగ్గురి మృతి**

**- అమెరికాలోని లూయిస్‌విల్లేలో ఘటన**

వాషింగ్టన్: అమెరికాలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. లూయిస్‌విల్లే నగరంలో టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఓకార్గో విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో 11మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈప్రమాదాన్ని అమె రికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారికంగా ధ్రువీకరించింది. వివరాల్లోకి వెళితే.. యూపీఎస్‌కు చెందిన ఫ్లైట్ నంబర్ 2976 కార్గో విమానం లూయిస్‌వి ల్లేనుంచి హొనులులుకు బయలుదేరింది. స్థానిక కాల మానం ప్రకారం సాయంత్రం 5:15 గంటలకు టేకాఫ్ అవుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.



## డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్

- న్యూయార్క్, వర్జీనియా మేయర్లుగా డెమాక్రట్లు
- న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దాని
- వర్జీనియాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హాష్మీ
- ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్న వ్యక్తులే కావడం విశేషం

న్యూయార్క్, :అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. అగ్రరాజ్యం అమెరికాలో పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో భారతతి సంతతికి చెందిన వ్యక్తులు, డెమోక్రాట్లు తమ హవా కొనసాగించారు. యూఎస్ ఆర్థిక రాజధాని న్యూయార్క్, వర్జీనియాలో జరిగిన తాజా ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు విజయం సాధించారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. ఈ ఘనత సాధించిన తొలి ముస్లిం, భారత సంతతి, ఆఫ్రికన్ సంతతికి చెందిన తొలి మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. 34 ఏండ్ల మమ్దానీ జూన్‌లో జరిగిన డెమోక్రాటిక్ ప్రైమరీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మేయర్ అభ్యర్థిగా నిలిచారు. తాజాగా జరిగిన మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ విజయం సాధించారు. ఒక ఉన్నత కుటుంబం నుంచి స్వయం ప్రకటిత ప్రజాస్వామ్య సోషలిస్ట్ అయిన మమ్దానీ భారత సంతతికి చెందిన తల్లిదండ్రులకు ఉగాండాలో జన్మించాడు. ఏడేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. 2018లో సహజ పౌరసత్వం పొందారు. మరోవైపు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ అభ్యర్థిని గజాలా హాష్మీ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. హష్మీ 15వ సెనెటో రియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్ గజాలా. ఇలా న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్దానీ గెలిచి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ 34 ఏళ్ల జొహ్రాన్ మేయర్ గా విజయం సాధించారు.





## బీహార్‌లో ఎన్‌డీఏ కూటమిదే విజయం

**మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ**

న్యూఢిల్లీ, : బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఏదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.



## బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం

**ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్న సిఎం రేవంత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు.




## తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

**సముద్రతీరాలు, నదీతీరాల్లో పుణ్యస్నానాలు**

**ఆలయాల్లో శైవరాధన..కార్తీక దీపాల వెలిగింపు**

**హైదరాబాద్/,తెలంగాణ దిశ :** తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరిం చారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి,కృష్ణానదుల్లో స్నానం చేయడంతో పాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు.



## ఆ రోడ్డే డేంజర్..

**ఆరేళ్లలో 200 మంది పైగా మృతి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ గేటు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మంది దాకా చనిపోయారు. వాస్తవానికి ఈ రోడ్డు మీద జరిగిన ప్రమాదం కొత్తదేమి కాదు. ఎందుకంటే ఈ రోడ్డు అత్యంత డేంజర్. ఆ జిల్లాలోనే కాదు.. ఏకంగా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకరమైన రహదారిగా ఇది పేరుపొందింది. ఈ రోడ్డు మీద జరిగిన ప్రమాదాలలో 200 మంది దుర్మరణం చెందారు. 600 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాస్తవానికి ఈ రోడ్డు ఇలా ఎందుకు మారిందంటే.. జాతీయ రహదారి 163 అప్పా జంక్షన్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు నిర్మించాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. అయితే ఈ రోడ్డుకు రెండు వైపులా కూడా చెట్లు విపరీతంగా ఉన్నాయి. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు ఇవ్వడం లేదు. అందువల్లే ఈ రోడ్డు నిర్మాణానికి అంతరాయం ఏర్పడుతోంది. హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారి 163(ఇది చేవెళ్ల వికారాబాద్ తాండూరు రూట్) పై గడచిన ఐదు సంవత్సరాల కాలంలో విపరీతమైన రోడ్డు ప్రమాదాలు జరిగాయి.



## కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

**ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్ల లో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్ గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చి చెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

# ఐఎఫ్ డబ్ల్యూజే స్ఫూర్తితో జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

## - ఘనంగా వజ్రోత్సవ వేడుకలు





**హైదరాబాద్, నవంబర్ 05, తెలంగాణ దిశ)** :దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడిన ఘన చరిత్ర ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) సంఘానిదేనని పలువురు వక్తలు అన్నారు. ఈ సంఘం దేశంలోనే మొట్టమొదటి జర్నలిస్టు సంఘమని వారన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే ఆవిర్భవించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా బుధవారం హైదరాబాద్ లో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వజ్రోత్సవ వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లాల జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు చిర్రా శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొట్లపల్లి అశోక్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం గత 75 సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై చేస్తున్న పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ... ఐఎఫ్ డబ్ల్యూజే దేశంలోనే తొలి జర్నలిస్టు యూనియన్ అని 1950 అక్టోబర్ 28న ట్రేడ్ యూనియన్ గా ఏర్పడిందని అన్నారు. దేశ వ్యాప్తంగా 30 వేలకు పైగా జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని, దేశంలోనే 28 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, నేపాల్, భూటాన్ తదితర పొరుగు దేశాల జర్నలిస్టు సంఘాలతో సంబంధాలు కలిగి జర్నలిస్టుల సమస్యలపై అంతర్జాతీయ స్థాయిలో కూడా పోరాటాలు చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల శ్రేయస్సు కోసం ఐఎఫ్ డబ్ల్యూజే కొన్ని ప్రధాన డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తున్నదని, ప్రధానంగా జర్నలిస్టుల రక్షణ చట్టం, జర్నలిస్టులకు అవసరమైన సంక్షేమ పథకాలు, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం వంటి డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తుందని అన్నారు. అమలు చేయాలి. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతను కొనసాగిస్తూ కనీస వేతనం కోసం వేజ్ బోర్డు అమలు చేయాలని కూడా డిమాండ్ చేస్తుందని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో జర్నలిస్టులకు ప్రభుత్వం హెల్త్ కార్డులను అందించి అన్ని కార్పోరేట్ ప్రైవేట్ ఆసుపత్రులలో జర్నలిస్టులకు వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్ డబ్ల్యూజే స్ఫూర్తితో డిమాండ్ల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని మామిడి సోమయ్య పిలుపు నిచ్చారు. ఈ వేడుకల్లో ఫెడరేషన్ నాయకులు పాండురంగారావు, బొల్లం శ్రీనివాస్,నాగవాణి, శ్రీనివాస్ గౌడ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# పేద వృద్ధురాలికి నిత్యావసర సరుకుల పంపిణీ



**కీసర, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :పేద వృద్ధురాలికి రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులను బిజెపి సీనియర్ నాయకులు పెద్దర్ల శరత్ చంద్ర చౌదరి పంపిణీ చేశారు. గతంలో డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డ లో నివసించిన తిప్పారపు మంగ ప్రస్తుతం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని బండ్లగూడలో నివసిస్తుంది. ఆమెకుటుంబ పరిస్థితి దయనీయంగా ఉన్న విషయం తెలుసుకున్న శరత్చంద్ర ఆమె నివాసానికి వెళ్లి వారికి రెండు నెలల పాటు సరిపోయే బియ్యం, నూనె, పప్పులు ఇతర నిత్యవసర సరుకులు అందించారు. కడు దయనీయ పరిస్థితులలో ఉన్న మంగ కుటుంబాన్ని ఆదుకున్న శరత్ చంద్రను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా శరత్ చంద్ర మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న విధంగా పేద కుటుంబంలో దయనీయ పరిస్థితులలో ఉన్న మంగకు తోచిన సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడూరి గగన్ కుమార్, నర్సింహ్మ చారి, డిఎల్. సురేష్, అరుణ్ కుమార్, యశ్వంత్ యాదవ్ పాల్గొన్నారు.

# వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి

## - ప్రభుత్వ ఉత్తర్వులు 34 ను అమలు చేయాలి
## - 10న కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**ఏఎస్ రావునగర్, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని, ప్రభుత్వ ఉత్తర్వులు (జిఓ) 34ను అమలు చేయాలని కోరుతూ ఈ నెల పదవ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ పిఆర్ డి) రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కమలానగర్ లోని ఎన్ వి భాస్కర్ రావు భవన్ ప్రాంగణంలో ఎన్ పిఆర్ డి నాయకులతో కలిసి ధర్నా కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు 34 ద్వారా మహిళా శిశు సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమ శాఖ మధ్య జిల్లాలో అందుబాటులో ఉన్న ఉద్యోగులను సర్దుబాటు చేసి వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని 2022 డిసెంబర్ 2వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం జీఓ జారీ చేసి మూడు సంవత్సరాలవుతున్న అమలు కావడం లేదన్నారు. వికలాంగుల సంక్షేమం, నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో అసిస్టెంట్ డైరెక్టర్ ను తిరిగి నియమించాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 23 నెలలు అవుతున్న జీఓ 34 అమలు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేలాది ఉద్యోగాలను కొత్తగా నియమించడం జరిగిందని, వారిలో నుండి వికలాంగుల సంక్షేమ శాఖకు అవసరమైన ఉద్యోగులను నియమించడానికి అవకాశం ఉన్న ప్రభుత్వం అలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని కోరుతూ గత ప్రభుత్వం హయాంలో అనేక ఉద్యమాలు చేసి సాధించుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీఓ 34 ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఇందుకోసం జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఈనెల 10 నిర్వహించ తలపెట్టి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె. చంద్ర మోహన్, కార్యదర్శి కె. నాగలక్ష్మి, సుల్తాన్ రమేష్, శివ, మోజెస్, వెంకటేశ్వర్లు, వీరప్ప పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయం తథ్యం

## - బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి







**జూబ్లీహిల్స్, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయం తధ్యమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. బుధవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయాన్ని చింతల వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ లోని స్వరాజ్ నగర్,బంజారానగర్ బూత్ నంబర్ 322, 330, 331, 332, 333 లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన వాగ్దానాలతో పాటు ఎన్నికల్లో హామీ ఇవ్వని ఎన్నో పనులను, పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన సేవలు కొనసాగాలంటే నవంబర్ 11న జరగనున్న ఎన్నికల్లో మూడవ నెంబర్ పై ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, పార్టీ భువనగిరి, కుత్బుల్లాపూర్, ఇంచార్జిలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం

## - మహిళా కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి





**జూబ్లీహిల్స్, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని మహిళా కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ గడపలో, ప్రతీ ఒక్కరి నోట నవీన్ యాదవ్ పేరే వినిపిస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి బోరబండ డివిజన్లో నిర్వహించిన గడప గడపకు ప్రచారంలో నీలం పద్మ చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక నాయకులతో, డోర్నకల్, ములుగు నియోజకవర్గ కార్యకర్తలతో కలిసి కాలనీలన్నీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. బిఆర్ఎస్, బిజెపి నాయకులు సోషల్ మీడియాలో ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా, జూబ్లీహిల్స్ ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరని నీలం పద్మ స్పష్టం చేశారు. నవీన్ యాదవ్ ఇక్కడే పుట్టి పెరిగిన వ్యక్తి. కష్ట కాలంలో ప్రజలకు ఆయన చేసిన సహాయాన్ని స్థానికులు ఇంకా గుర్తుంచుకున్నారు. అందుకే ప్రతి ఒక్కరి నోట ఆయన పేరే వినిపిస్తోందని ఆమె అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుగుణ, ముస్లిం మహిళలు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

## - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :సంక్షేమ సంఘాలు ప్రజా ప్రతి నిధులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. బుధవారం గాజుల రామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్ – ఏ నూతన సంక్షేమ సంఘం సభ్యులు చింతల్ లో వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిత్యం జరిగే ప్రక్రియని కాలనీలో ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించడంలో నూతన సంక్షేమ సంఘానికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, తెలంగాణ సాయి, చందు ముదిరాజ్, నూతన అధ్యక్షులు చంద్ర గౌడ్, ప్రధాన కార్యదర్శి రజాక్, ఉపాధ్యక్షులు వీరేష్ గౌడ్, అజ్మత్, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రాజలింగం గౌడ్, ఆంజనేయులు, కిషోర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ రోడ్ మూసివేతతో సిద్దార్థ కాలనీ వాసుల ఇబ్బందులు




**దమ్మాయిగూడ, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :దమ్మాయిగూడ అణుశక్తి నగర్ వాటర్ ట్యాంక్ నుండి సిద్దార్థ కాలనీకి వచ్చే ప్రధాన రహదారిని కొందరు వ్యక్తులు అక్రమంగా మూసివేయడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీకి నేరుగా వచ్చే దారి మూసుకుపోవడం వల్లప్రజలు వందల మీటర్లు అదనంగా తిరిగి మెయిన్ రోడ్డు ద్వారా రాక పోకలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిద్దార్థ కాలనీ వాసులు మాట్లాడుతూ పిల్లలు స్కూల్‌కు వెళ్లడం, వృద్ధులు హాస్పిటల్‌కు వెళ్లడం, ప్రతి రోజు ఉద్యోగాలకు వెళుతున్న ప్రజలకు ఇది పెద్ద ఇబ్బందిగా మారిందన్నారు. దారి మూసివేయడానికి ఎలాంటి అధికారం ఎవరికీ లేదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
అంతేకాక కాలనీలో ఉన్న రహదారిపై ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ప్రారంభించి, వాటిని మధ్యలోనే ఆపేయడం వల్ల పరిస్థితి మరింత దారు ణమైందన్నారు. రోడ్డు బంద్ చేసిన వారు తమ ప్రయోజనం కోసం ప్రజల హక్కులను దెబ్బ తీస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం తథ్యం

## - కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, నవంబర్ 05, (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీన్‌యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్లను చెయ్యి గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా హబీబ్ నగర్, ఫాతిమా నగర్ లలో ఇంటింటికి కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## వలసల ఉద్యమం..!

అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వలసలు. ఆయా దేశాల్లో జీవన ప్రమాణాలు అత్యున్నతంగా ఉండటం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో ఇతర దేశాల నుంచి వలసలు బాగా పెరిగిపోయాయి. గతంలో వారికి సాదర స్వాగతంలభించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. చాలా దేశాలలో "స్థానికులకే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దక్కాలి" అనే నినాదంతో నిరసనలు, ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. లండన్ నగర కేంద్రంలో వలసదారుల వ్యతిరేకంగా భారీ ఆందోళన జరిగింది.వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ నిరసనలో, ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. యూరప్‌లో వలసదారులపై పెరుగుతున్న వ్యతిరేకత మరోసారి స్పష్టమవుతోంది. యూనైటెడ్ కింగ్ డమ్ (బ్రిటన్) రాజధాని లండన్ లో అనూహ్య రీతిలో చోటు చేసుకున్న నిరసన ఇప్పుడు ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. యూకే చరిత్రలోనే అతి పెద్ద నిరసనగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వలసలకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో లండన్ రోడ్లపైకి 1.10లక్షల మంది వచ్చి నిరసన తెలిపారు. దీనికి వ్యతిరేకంగా స్టాండ్ అప్ టు రేసిజిమ్ పేరుతో మరో నిరసన జరిగింది.లండన్ లో ఈ నిరసనకు వలసలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో యునైట్ ది కింగ్ డమ్ పేరుతో ఈ ప్రదర్శనను నిర్వహి ంచారు. ఈ ప్రదర్శనల్లో అమెరికా.. ఇజ్రాయెల్ జెండాల్ని కొందరు నిరసనకారులు ప్రదర్శించారు. అంతేకాదు.. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ విధానాల్ని తప్పుపడుతూ నినాదాలు చేశారు. వలసల్ని వెంటనే వెనక్కి పంపేయాలంటూ వలసలకు వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న ప్లకార్డుల్ని పెద్ద ఎత్తున ప్రదర్శిం చారు. ఈ నిరసనల్లో పాల్గొన్న వారిలో కొందరు మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అనే క్యాప్షన్ ఉన్న టోపీల్ని ధరించటం గమనార్హం. ఇటీవల కాలంలో బ్రిటన్ కు అక్రమ వలసలు భారీగా పెరిగాయి. ఒక అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు 28 వేల మందికి పైగా వలసదారులు పడవల ద్వారా బ్రిటన్ కు చేరుకున్నట్లుగా కొన్ని రిపోర్టులు చెబుతున్నాయి. ఇలా వలసలు పెద్ద ఎత్తున చేరుకోవటంపై స్థానిక జనాభా ఆగ్రహంతో ఉన్నారు. అంతేకాదు.. వలసల్ని ప్రభుత్వం హోటళ్లలో ఉంచటాన్ని తప్పు పడుతున్నారు. అక్రమ వలసలు దేశానికి భారంగా మారినట్లుగా యాంటీ ఇమిగ్రేషన్ నిరసనకారులు మండిపడుతున్నారు.ఈ ర్యాలీకి నాయకత్వం వహించిన టామీ రాబిన్ సన్ కు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ లాంటి ప్రముఖుల మద్దతు ఉందన్న వార్తలు వస్తున్నాయి. వలసదారులు దేశ వనరుల్ని వాడేస్తున్నారని.. స్థానిక ఉద్యోగాల్ని కొల్లగొడుతున్నట్లుగా నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బ్రిటన్ ఆర్థికవ్యవస్థ తీవ్రకష్టాల్లో ఉంటే.. అక్రమ వలసదారులు దేశానికి భారంగా మారటమేకాదు.. తమ జాతీయ గుర్తింపు.. సాంస్కృతి విలువలు ప్రమాదంలో పడుతున్నట్లుగా భావిస్తున్నారు. నిరసనకారులకు నాయకత్వం వహిస్తున్న టామీ రాబిన్సన్ జర్నలిస్టుగా పని చేస్తున్నారు.వలసలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న వారికి వ్యతిరేకంగా "స్టాండ్ అప్ టు రేసిజమ్" పేరుతో నిరసన చేపట్టారు. ఇందులో కేవలం 5 వేల మంది మాత్రమే పాల్గొన్నారు. వీరు తమ నిరసనలు తెలిపే వేళలో చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. పోలీసుల ముందస్తు జాగ్రత్తల కారణంగా ఈ రెండు వర్గాలు ఒకరి ఎదుట మరొకరు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోటాపోటీగా నిరసనలు నిర్వహించిన నిరసనకారులు ఎదురుపడి ఉంటే పెద్ద సమస్యగా మారటమే కాదు శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యేదని చెబుతున్నారు.స్టాండ్ అప్ టు రేసిజమ్ పేరుతో నిరసనలు తెలిపిన ఐదువేల మంది సమూహం పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా.. వారిపై వాటర్ బాటిళ్లు.. ప్లకార్డులతో దాడికి పాల్పడ్డారు. ఈ అల్లర్లతో దాదాపు 26 మంది పోలీసు అధికారులు గాయపడగా.. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతునారు. ఈ అల్లర్లకు కారణమైన వారిలో పాతిక మందిని పోలీసులు అరెస్టు చేసినట్లుగా తెలుస్తోంది. అల్లర్లలో పాల్గొన్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోనున్నట్లుగా పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. వలసలకు వ్యతిరేకంగా యూకే చరిత్రలో ఇప్పటివరకు ఎప్పుడూ లేని రీతిలో నిర్వహించిన ఈ భారీ ర్యాలీ రానున్న రోజుల్లో తీవ్రమైన రాజకీయ పరిణామాలకు కారణమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విదేశాల నుంచి వచ్చిన వలసదార్లు, ప్రధానంగా భారతీయులకు వ్యతిరేకంగా ఆదివారం ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. ఒక ప్రణాళిక ప్రకారం 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరుతో ఈ ప్రదర్శన లను నిర్వహించారు. భారతీయుల వలసలు దేశ సంస్కృతికి ముప్పు కలిగిస్తున్నాయని నిర్వాహకులు ఆరోపించారు. ఇది 'కొత్త సంస్కృతి స్థాపన'కు దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. 100 ఏళ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కన్నా అయిదేళ్లలో వచ్చిన భారతీయుల సంఖ్యే అధికంగా ఉందని విమర్శించారు. వలసదార్ల కారణంగా ఇళ్ల కొరత ఏర్పడిందని, ఉద్యోగ భద్రత తగ్గిందని, జీవన ప్రమాణాలు, పర్యావరణం, జాతీయ గుర్తింపు నకు ముప్పు ఏర్పడిందన్నారుఐరోపాలో ఈ సెగ మరింత తీవ్రంగా ఉంది. లండన్ వీధుల్లో ఏకంగా లక్షన్నర మంది వలసలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలో పాల్గొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జర్మనీ, డబ్లిన్, వార్సా వంటి నగరాల్లోనూ ఇదే తరహా ఆందోళనలు జరిగాయి. ఈ పరిణామాలన్నీ విదేశాల్లో విద్య, ఉద్యోగాల కోసం వెళ్లే భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం ఆర్థిక భద్రతే కాకుండా, సామాజిక భద్రత కూడా కరవయ్యేప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ వలస వ్యతిరేక నిరసనలు భారతీయులే లక్ష్యంగా జాతి విద్వేష దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం దౌత్యపరంగా గట్టి చర్యలు తీసుకోవడంలో విఫలమైందని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. కేవలం సూచనలు, సలహాలకే పరిమితం కాకుండా, ఆయాదేశాలతో చర్చించి భారతీయుల భద్రతకు భరోసా కల్పించడంలో విదేశాంగ శాఖ విఫలమైందని వారు అభిప్రాయపడుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**కుత్బుల్లాపూర్, నవంబర్ 05, (తెలంగాణ దిశ) :**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు జీడిమెట్ల సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు ఆకర్షితులై బుధవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. అదే విధంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని తెలిపారు. ప్రతి తెల్ల కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ గతంలో ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. ప్రజా



ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనలో ఎల్లప్పుడు ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితురాలికి పరామర్శ

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, నవంబర్ 05, (తెలంగాణ దిశ) :**రంగారెడ్డి జిల్లా చేవెళ్ల



మండలం ఖానాపూర్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనలో ఈమె గాయపడిన కాప్రా సాయి బాబా నగర్ కు చెందిన తాడెం వెన్నెలను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆమె తాండూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. బస్సు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి చికిత్స పొందుతున్న ఈమెను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి అధికారులతో మాట్లాడి హాస్పిటల్ లో అయ్యే ఖర్చు ప్రభుత్వం



చెల్లించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన రహదారి భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్ సమగ్రాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా : నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, నవంబర్ 05, (తెలంగాణ దిశ) :**మల్లాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తారని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు నెమిలి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం ఓల్డ్ మల్లాపూర్ ఎస్ వి నగర్ కాలనీలో సిఎం నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర రెడ్డి సహకారంతో తాను చొరవ తీసుకొని సిఎం నిధులతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. సీసీ రోడ్డు పనులను అనిల్ కుమార్ పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీ వాసులు విన్నపం మేరకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

# చీర్యాలలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

(కీసర, తెలంగాణ దిశ)

# బియ్యం, నిత్యవసర సరుకులు అందజేత

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** సుందరం ఫౌండేషన్ ఫౌండర్, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి సహకారంతో మండలం లోని పలు కు టుంబాలకు బియ్యం మరియు నిత్యవసర సరుకులు అందజేశారు. కమాన్‌పూర్ మండలం, గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ గ్రామం పేద కుటుంబానికి చెందిన యాదగిరి భాగ్యమ్మ కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యవ సర సరుకులు నాగారం గ్రామపంచాయతీ చెందిన ఇటవేన రాజయ్య ఇటీవల మరణించగావారి కుటుంబానికి 25 కిలోల బియ్యం నిత్యవసర సరుకులు జూలపల్లి గ్రామ పంచాయతి పరిధిలోని ఇరుగురాల ఓదెలు భార్య లక్ష్మి ఇటీవల అనారోగ్య ంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 50కిలోల బియ్యం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి, సెక్రటరీ చిప్పకుర్తి అరవింద్ సభ్యులు చెన్నోజు చంద్రశేఖర్, కామ సంతోష్, మచ్చ రాజేశం, కల్లేపల్లి నర్సింగం, ఇరుగురాల పోశం, వెంకటి, మధునయ్య, రాజయ్య, కొమురయ్య, రేణుకుంట్ల మధునయ్య, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్

### సిటిజన్ సర్వేలో అందరు పాల్గొనాలి

**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** తెలంగాణ రైజింగ్ – 2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ – 2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారని అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేశారు.

# ఫ్యూచర్ లీడర్ లోకేష్ నా..?



విజయవాడ: చంద్రబాబు తర్వాత ఎవరు.. ఈ ప్రశ్నకు టీడీపీలో అయితే ఆన్సర్ వెంటనే వస్తుంది నారా లోకేష్ అని..! మరి కూటమి ప్రభుత్వంలో ఎవరు..?అది చెప్పడం కొంచం కష్టం..అయితే ఆ కష్టాన్ని ప్రధాని మోదీ ఈజీ చేస్తున్నారా..? నారా లోకేష్‌ను ఫ్యూచర్ లీడర్‌గా రెడీ చేస్తున్నారా..?ఏపీలో ఎన్నికలు కొత్త 'సన్‌రైజ్'ను తీసుకురావచ్చు, కానీ 'సన్ సెట్' కూడా జరుగుతుంది" అని మోదీ చంద్రబాబు, లోకేష్‌లను ఉద్దేశించి విమర్శించారు. ఇక్కడ సన్‌సెట్ అంటే నారా లోకేష్ రాజకీయ భవితవ్యం ఆ ఎన్నికలతో ముగిసిపోతుందన్నది మోదీ మాటల అంతరార్థం అదే నరేంద్రమోదీ .. అదే కర్నూలులో ఇప్పుడు ప్రధానిగా అధికారిక హోదాలో నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. అవసరానికి మించి ఎలివేషన్ ఇస్తున్నారు. చిన్నబాబుతో ప్రత్యేక సమావేశాలు.. ఆయన్ను ప్రత్యేకంగా పొగడటాలు.. ట్వీట్‌లలో ప్రత్యేక ప్రస్తావనలు..వీటన్నింటి ద్వారా ప్రధాని మోదీ నారా లోకేష్ ఫ్యూచర్ లీడర్ అన్న సంకేతాలు ఇస్తున్నారా..?ప్రస్తుతానికి ఇది అప్రస్తుతమే కానీ? ఓ చర్చ అయితే పార్టీలో నడుస్తుంటుంది కదా.. టీడీపీలో అయితే దీనిపై పెద్దగా ఆలోచించడానికేం ఉండదు.. చంద్రబాబు తర్వాత లోకేషే..! అయితే పార్టీలో పొజిషన్ కాకుండా.. ప్రభుత్వంలో పొజిషన్ గురించి మాట్లాడుకున్నప్పుడు దీనికి ఆన్సర్ చెప్పడం అంత సులభం కాదు. పైగా చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నంత కాలం ఆయన నాయకత్వమే ఉండే అవకాశం ఉంటుంది. ఏపీలో బీజేపీ మైనర్ పార్టీ కాబట్టి.. ఈ కూటమిలో కీలకంగా ఉన్న జనసేన, బాగా పాపులారిటీ ఉన్న జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లోకేష్ కు పోటీదారు అవుతారు. అయితే ఈ డిస్కషన్ రాకుండా చేసేందుకు రెండు పార్టీల నేతలు ఈ చర్చను రానివ్వరు. పైగా పవన్ కల్యాణ్ చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వంలో ఇంకో 15 ఏళ్లు ఉండాలని పలు సందర్భాల్లో చెప్పారు. లోకేష్ కూడా తన రాజకీయ భవితవ్యంపై చర్చ రాకుండా జాగ్రత్త పడతారు.. కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం జరిగిన విషయాన్ని గుర్తుచేసుకుంటే.. అప్పట్లో పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది. ప్రమాణ స్వీకార వేదికపై పవన్‌ను ప్రత్యేకంగా పక్కకు పిలవడం? ఆ తర్వాత అమరావతి 2.0 కార్యక్రమంలోనూ పవన్ కు ప్రాధాన్యత ఇవ్వడం? మరో సందర్భంలో ఆయన్ను పెనుగాలిగా అభివర్ణించారు. ఇప్పటికీ పవన్ కల్యాణ్ పట్ల ఆ ప్రత్యేకమైన అభిప్రాయం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో లోకేష్ ఢిల్లీ స్థాయిలో రైజ్ అయ్యారు. కూటమిలో కీలకంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో మాత్రం లోకేష్ లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేసేవారు. అయితే విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం తర్వాత లోకేష్ రేంజ్ పెరిగింది. గిన్నీస్ రికార్డ్ స్థాయిలో దాని నిర్వహణ విషయంలో లోకేష్ చూపిన చొరవను ప్రధాని గుర్తించారు. వేదిక మీదనే ప్రత్యేక స్థానాన్నిచ్చారు. ఆ తర్వాత వచ్చి తనను కలవాలంటూ పిలిచారు. ప్రధాని ఆహ్వానం మేరకు లోకేష్ కుటుంబంతో సహా వెళ్లి మోదీని కలిశారు. ఆయనతో కలిసి దాదాపు గంటన్నర సేపు డిన్నర్ మీటింగ్ చేశారు. అప్పటి నుంచే మోదీతో లోకేష్ అటాచ్‌మెంట్ పెరిగింది. ఆ తర్వాత లోకేష్ ఢిల్లీ వెళ్లడం కూడా పెరిగింది. చాలామంది కేంద్రమంత్రులను తరుచూ కలుస్తున్నారు. గుగూల్ ను విశాఖకు రప్పించడంతో ఆయన ఖ్యాతి అమాంతం పెరిగిపోయింది. ప్రధాని సహకారం లేకుండా ఇది జరిగే అవకాశం లేదు. యోగాంధ్ర సక్సెస్ గురించి ఆయన కేంద్ర కేబినెట్‌లో మాట్లాడారు. నిన్న కర్నూల్ పర్యటన తర్వాత.. ట్వీట్ చేసిన ప్రధానమంత్రి? ప్రత్యేకంగా లోకేష్‌ను మెన్షన్ చేశారు. దీనిని బట్టే ఆ ట్వీట్‌కు ఉన్న ప్రాధాన్యత తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా చెప్పడానికి లోకేష్ ఏమీ ముఖ్యమంత్రి కాదు కదా? లోకేష్‌కు ఆ స్థాయి ఎలివేషన్ ఇవ్వడానికి ప్రధానికున్న ప్రధానమైన కారణం ఏంటి.ఈ ఎన్నికల్లో అప్రతిహత విజయంతో కూటమి ఏపీలో తిరుగులేని స్థానంలో ఉంది కానీ.. 2019కి ముందు పరిస్థితి వేరు. ప్రధాని హోదాలో నరేంద్ర మోదీతో సహా.. బీజేపీ మొత్తం లోకేష్‌ను కూడా టార్గెట్ చేసింది. అంటే 2019కి ముందు నారా లోకేష్ పై ప్రధాని మోదీకి తీవ్రమైన వ్యతిరేకత భావం ఉంది. వారసత్వంగా వచ్చి ప్రజలపై పెత్తనం చేయాలనుకుంటున్నారని భావనకు వచ్చారు. సమర్థత ఉన్న వారసులను ప్రోత్సహించడానికి మోదీ వెనుకాడరు. కానీ ప్రజలపై బలవంతంగా రుద్దితేనే వ్యతిరే కిస్తున్నారు. లోకేష్ విషయంలో అప్పట్లో ఆయన అదే ఫీల్ అయ్యారని ప్రచారసభల్లోని మాటలను బట్టి అర్థమైపోతుంద ఆ తర్వాత ఐదేళ్లకు పరిస్థితులు మారాయి. 2024లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఈ కూటమి కట్టడంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపారని.. బీజేపీని టీడీపీని కలపడానికి తన వంతు కృషి చేశారని జనసేన నేతలు .. పవన్ కల్యాణ్ కూడా చెబుతుంటారు. దానికి తగ్గట్లుగా ప్రధాని ఆయనకు ప్రాధాన్యం కూడా ఇచ్చారు. "రాష్ట్రవ్యాప్తంగా 'సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్స్' ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గారికి అభినందనలు తెలియజేస్తు న్నాను. సృజనాత్మక పోటీల ద్వారా, యువతలో జీఎస్టీ పట్ల అవగాహన పెంచగలిగారు.." అని అభినందించారు. ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు. ఇటీవలి కాలంలో ప్రధాని మోదీ .. నారా లోకేష్ పై ప్రత్యేకమైన అభిమానం చూపిస్తున్నారు. వ్యక్తిగత అంశాలపైనా సలహాలు ఇస్తున్నారు. కర్నూలులో హెలికాప్టర్ వద్ద ఆహ్వానం పలికినప్పుడు బాగా బరువు తగ్గావు అని లోకేష్‌ను అభినందించారు. లోకేష్ పై ప్రధాని మోదీ.. కూటమిలో పార్టీ నేత అయినందునే అభిమానం చూపిస్తున్నారని అనుకోలేము. వారసుడు అనే వ్యతిరేకతను మోదీ తుడిచేసుకున్నారని ఆయన సామర్థ్యాన్ని గుర్తించారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. చంద్రబాబు తర్వాత లోకేష్ నాయకత్వాన్ని అన్ని రకలుగా మోదీ గుర్తిస్తున్నారా అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జరుగుతన్న సంఘటనలు దానిని బలపరుస్తున్నాయి కూడా..!ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూడాలి. పొత్తులతో పార్టీలను నడుపుతున్నప్పుడు.. మిత్రుల మనోభావాలను పట్టించుకోవాలి. పవన్ కల్యాణ్ నిర్ద్వందంగా చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థిస్తున్నారు. ఇంకో 15 ఏళ్లైనా ఆయన నేతృత్వంలో పనిచేయడానికి సిద్ధమే అన్నట్లు మాట్లాడుతున్నారు. పవన్ కల్యాణ్ అలా అంటున్నారుని కానీ.. ఆయన పార్టీ క్యాడర్ మాత్రం ఆయన్ను ఎప్పుడు సీఎంగా చూద్దామా అన్న ఆతృతలో ఉంది.పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వారికి నచ్చడం లేదు కూడా .. ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూస్తే.. పవన్ చంద్రబాబు నాయకత్వాన్ని అన్నారు కానీ.. టీడీపీ నాయకత్వం అనలేదు. అంటే టీడీపీలో ఎవరైనా అని చెప్పలేదు.



# అనేక వ్యాధులను తగ్గించే ఈ మొక్క..

## మన ఇంటి చుట్టూనే పెరుగుతుంది.. కనిపిస్తే వదలకండి..

మన వంట ఇంటి పోపు దినుసుల్లో వాము కూడా ఒకటి. ఇది ఎంతో సువాసనను కలిగి ఉంటుంది. దీన్ని కూరల్లో వేస్తే మంచి రుచి, వాసన వస్తాయి. అయితే కేవలం వాము గింజలు మాత్రమే కాదు, మనకు వాము ఆకులు కూడా లభిస్తాయి. ఈ మొక్క చాలా మంది ఇళ్లలో పెరుగుతూనే ఉంటుంది. కానీ దీన్ని వాము ఆకు మొక్క అనిఎవరూ గుర్తు పట్టి ఉండరు. ఈ మొక్క ఆకులను కూడా మనం పలు వ్యాధులను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. వాము ఆకుల్లో అద్భుతమైన ఔషధగుణాలు ఉంటాయనిఆయుర్వేదం చెబుతోంది. దీంతో అనేకలాభాలు పొందవచ్చునివైద్యులు అంటున్నారు.

జీర్ణ సమస్యలకు..: వాము ఆకులను నేరుగా అలాగే నమిలి తినవచ్చు. దీంతో పొట్టలో ఉండే అసౌకర్యం తగ్గుతుంది. కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల్లో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లు, జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకులను తినడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. కొందరు ఆహారం అతిగా తింటారు. దీంతో బరువు పెరుగుతారు. అయితే ఈ సమస్య నుంచి బయట పడాలంటే వాము ఆకులను రోజూ నమిలి తింటుండాలి. దీంతో ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. వాము ఆకులను నమలడం వల్ల అతిగా తినడం అనే సమస్య తగ్గుతుంది. బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు ఈ ఆకులను తింటుంటే ఫలితం ఉ ంటుంది. శ్వాసకోశ సమస్యలకు..: వాము ఆకులు దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. గొంతు, ఊపిరితిత్తులలో ఉండే కఫాన్ని కరిగిస్తాయి. దీంతో ఊపిరితిత్తులకు గాలి సరిగ్గా లభిస్తుంది. శ్వాసనాశాలు క్లియర్ అవుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి బయట పడవచ్చు.గొంతులో గరగర,నొప్పి, మంట ఉన్నవారు వాము ఆకులను నీటిలో వేసి మరిగించి

తాగుతుంటే ఫలితం ఉంటుంది. ఆస్తమా ఉన్నవారు ఈ నీళ్లను తాగుతుంటే సత్వరమే ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక ఈ ఆకులను నోట్లో వేసుకుని నమిలి తింటుంటేనోట్లోని బ్యాక్టీరియా నశిస్తుంది.దీంతోనోటి దుర్వాస న తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. నోటి సమస్యలు కూడా తగ్గుతాయి. నోట్లోని పుండ్లు నయమవుతాయి.

ఆర్థరైటిస్ నొప్పులకు..:

వాయు ఆకుల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. వాము ఆకులను మొటిమలను తగ్గించేందుకు కూడా ఉపయోగించవచ్చు.

ఈ ఆకులను మెత్తని పేస్టులా చేసి ముఖానికి రాస్తుంటే ముఖంపై ఉండే మొటిమలు, ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతి వంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాల సంరక్షణకు కూడా ఈ ఆకులను ఉపయోగించవచ్చు.

ఈ ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు శిరోజాలను సంరక్షిస్తాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తగ్గిస్తాయి. జుట్టు ఒత్తుగా, దృఢంగాపెరిగేలా చేస్తాయి.వాము ఆకుల్లోయాంటీ ఆక్సిడెం ట్లు అధికంగా ఉంటాయి.

# మంచినిద్రతో మేధాశక్తి



రాత్రిళ్లు తొందరగా, ఎక్కువసేపు పడుకొంటే టీనేజీ వయసువాళ్ల మెదడు పదునెక్కుతుందట. కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని కనుక్కొన్నారు. త్వరగా పడుకొని, ఎక్కువసేపు నిద్రించిన వాళ్లతో పోలిస్తే మిగిలిన వాళ్లు.. లెక్కలు చేయడం, పదజాలం, చదవడం లాంటి మేధాశక్తికి సంబంధించిన పరీక్షల్లో చాలా వెనకబడ్డారని ఈ పరిశోధనలో తేలింది. “నిద్రించే సమయంలోమనంజ్ఞాపకాలను సంఘటితం చేసుకుంటాం కాబట్టి, నిద్ర మన మెదడు సామర్థ్యాన్ని పెంచుతుంది” అని ఈ అధ్యయన బృంద నాయకుడు బార్బరా సహాకియాన్ వెల్లడించారు. కాబట్టి, పిల్లల నిద్రించే వేళలు, నిద్రలో నాణ్యత విషయంలో పెద్దలు తగినంత శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడే వాళ్లు జీవితంలో రాణిస్తారు.

## చారి ట్రబల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే సహాయం

%కొడిమ్యాల, ప్రజాక్రాంతి, 27: చొప్పదండి ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం చారి ట్రబల్ ట్రస్ట్ ద్వారా పేదరికం ఉన్నవారిని ఆదుకుంటూ అభిమానాన్ని చూరగొంటున్నారు. రూపదేవి చారి ట్రబల్ ట్రస్ట్ పేరుతో చొప్పదండి నియోజక వర్గంలో ఎక్కడ ఆపద వచ్చిన వారి దగ్గరికి వెళ్లి ఆదు కుంటున్నారు.

ఎవరుఫోన్ చేసిన స్పందిస్తున్నారు. సమస్యల పై దృష్టిపెడుతూ నియోజక వర్గం అంతా సభలు సమావేశాల్లో పాల్గొంటూ చురుకుగా పనిచేస్తున్నారు. అధికారులులతో పారదర్శకంగా పనులు చేయిస్తున్నారు.గతంలోనే రాజీవ్ యువ వికాస్ ధరఖాస్తులు పార దర్శకంగా పనిచెయ్యాలని అధికారులు కు సూచించారు. కొండగట్టు ఏర్పాట్లను పరి శీలించి చిన్న హనుమాన్, పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి ఏర్పాట్లను పరి శీలించి విజయం సాదించారు. వరికోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు సహాయం అందిస్తూ తన మార్క్ చూపిస్తున్నారు.


## మీ ఇంటి చుట్టు పక్కల మర్రి చెట్టు ఉందా..

# అందులోని ప్రతి భాగమూ ఉపయోగకరమే..!

పూర్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఏదో ఒక భారీ వృక్షం కనిపిస్తూనే ఉండేది. ముఖ్యంగా మర్రి చెట్లు మనకు ఎక్కువగా కనిపించేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య బాగా తగ్గిపోయింది. చూద్దామంటే అసలు ఈ చెట్లు కనిపించడం లేదు. అయితే మర్రి చెట్టు మనక నీడను మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని కూడా అందిస్తుంది. ఆయుర్వేదంలో మర్రి చెట్టుకు ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. మర్రి చెట్టుకు చెందిన అన్ని భాగాలు మనకు ఏదో ఒక విధంగా ఉపయోగపడతాయి. మర్రి మెరడు, ఆకులు, వేళ్లు, ఊడలు అన్నీ మనకు ఉపయోగపడేవే. ఈ క్రమంలోనే ఆయా భాగాలతో అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేదం చెబుతోంది.

డయాబెటిస్ అదుపులో..: మర్రి చెట్టు ఆకులు, బెరడులో యాస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ ఆకులు లేదా బెరడను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. మర్రి చెట్టు ఆకులను ఉపయోగించడం వల్ల పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. పొట్టలో అసౌకర్యంగా ఉన్నవారు కూడా మర్రి చెట్టు ఆకులను తీసుకుని వాటితో కషాయం తయారు చేసి తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారికి మర్రి చెట్టును వరంగా చెప్పవచ్చు. మర్రి చెట్టు బెరడు ఇందుకు చక్కగా పనిచేస్తుంది. దీంట్లో హైపో గ్లైసీమిక్ గుణాలు ఉంటాయి. అంటే ఇది షుగర్ లెవల్స్‌ను గణనీయంగా తగ్గిస్తుందన్నమాట. మర్రి బెరడును నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను సేవిస్తుంటే డయాబెటిస్ తగ్గుతుంది. మర్రి బెరడులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను కణాలు సరిగ్గా శోషించుకునేందుకు పనిచేస్తాయి. దీంతో షుగర్ లెవల్స్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

దంతాలు, నోరు, చిగుళ్ల సమస్యలకు..: మర్రి చెట్టు ఆకులను నేరుగా



అలాగే నమిలి కాసేపు అయ్యాక ఉమ్మేయాలి. ఇలా చేస్తుంటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. ముఖ్యంగా పుచ్చిపోయిన దంతాలు ఉన్నవారు, చిగుళ్ల నుంచి రక్తం కారుతున్న వారు ఈ చిట్కాను పాటిస్తే ఫలితం ఉంటుంది. నోట్లో ఉండే పొక్కులు, పుండ్లను తగ్గించడంలోనూ మర్రి ఆకులు, బెరడు ఎంతగానోఉపయోగపడతాయి.మర్రి బెరడులోయాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. మర్రి బెరడును కాస్త పొడి చేసి అందులో కొద్దిగా నీళ్లను పోసి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పూట ఆర్థరైటిస్ నొప్పులు ఉన్న చోట రాయాలి. ఇలా రోజూ చేస్తుంటే కొన్ని రోజులకు ఆర్థరైటిస్ నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే శరీరంలో ఇతర చోట్లలో ఉండే నొప్పులు కూడా తగ్గిపోతాయి.

చర్మ సమస్యలకు..: మర్రి ఆకుల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులు అనేక చర్మ సమస్యలను తగ్గిస్తాయి. ముఖ్యంగా తామర, గజ్జి, ఇతర చర్మ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. మర్రి ఆకుల పేస్ట్ లేదా బెరడు పొడి, నీటి మిశ్రమాన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానిపోతాయి. సూర్య కాంతి వల్ల చర్మం కందిపోయినా కూడా మర్రి ఆకుల మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. అలాగే మర్రి ఆకుల పేస్ట్‌లో కొద్దిగా చల్లని పాలను కలిపి ఈ మిశ్రమాన్ని రాస్తుంటే మొటిమలు, చర్మంపై ఉ ండే దురదలు,దద్దుర్లు తగ్గిపోతాయి.


# కొంచెం శ్రమకే ఆయాసమా?

కొన్ని మెట్లు ఎక్కగానే ఊపిరి సరిగ్గా ఆడటం లేదా? ఆయాసంగా అనిపిస్తున్నదా? ఏ కొంచెం శారీరక శ్రమ చేసినా ఊపిరి సరిపోవడం లేదంటే దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. వయసు పెరగడం, అలసట వల్ల ఇలా జరుగుతుంది. దీన్ని అయిదు ప్రధాన ఆరోగ్య సమస్యలకు హెచ్చరికగా భావించాలి. ఏదైనా అనుమానం అనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. తగిన చికిత్స తీసుకోవాలి.

రక్తహీనత: శరీరం తగిన మోతాదులో ఎర్ర రక్త కణాలు లేదా హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేయకపోతే రక్తహీనత (ఎనీమియా) వస్తుంది. హిమోగ్లోబిన్ మనం పీల్చిన గాలి నుంచి ఆక్సిజన్ గ్రహించి శరీర అవయవాలకు సరఫరా చేస్తుంది. హిమోగ్లోబిన్ తగ్గితే శరీర కణజాలానికి ఆక్సిజన్ తగినంతగా అందదు. దీంతో శ్వాసించే క్రమం తగ్గిపోతుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేస్తున్నప్పుడు ఇలా జరుగుతుంది. కాబట్టి, చర్మం పచ్చబడటం, బలహీనత, అలసట మొదలైన వాటితో బాధపడుతుంటే అది రక్తహీనత లక్షణం కావచ్చు.

గుండెజబ్బులు: చిన్న ప్రయత్నానికే ఊపిరి సరిగ్గా ఆడటం లేదంటే అది గుండెజబ్బుకు సంకేతం కావచ్చు. వయసు పెరిగేకొద్ది గుండె రక్తాన్ని పంప్ చేసే శక్తి తగ్గుతూ వస్తుంది. దీంతో ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ పేరుకుంటుంది. మెట్లెక్కేటప్పుడు మీకు కండ్లు తిరగడం (డిజినెస్), కాళ్లవాపు, ఛాతినొప్పి లాంటి సమస్యలు వేధిస్తుంటే డాక్టర్‌ను కలవాలి. ఇది గుండె సమస్యలకు సంకేతం అయ్యుంటుంది.

ఊపిరితిత్తుల సమస్యలు: మన శరీరానికి కావాల్సిన ఆక్సిజన్‌ను సరఫరా చేయడమే ఊపిరితిత్తుల పని. శ్వాసించడం కష్టమైపోతున్నదంటే అది ఊపిరితిత్తుల సమస్య కావచ్చు. ఆస్తమా,



బ్రాంకైటిస్, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ), క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) లాంటివి ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తాయి. ఫలితంగా ఏ కొంచెం శ్రమపడ్డా శ్వాసలో ఆటంకం (డిస్ప్నోయియా) కలుగుతుంది. దగ్గు, శ్వాస గుర్‌గుర్‌మని రావడం (వీజింగ్), ఛాతీలో అసౌకర్యంగా అనిపిస్తుంటే జాగ్రత్తగా ఉండాలి.

ఒత్తిడి- ఆందోళన: ఒత్తిడి, ఆందోళన కారణంగా కూడా ఊపిరి సరిగ్గా ఆడదు. అధిక ఒత్తిడి వల్ల శరీరం అడ్రినలిన్ హార్మోన్‌ను ఎక్కువగా విడుదల చేస్తుంది. ఇది శ్వాసించే క్రమాన్ని పెంచుతుంది. దీంతో సరిగ్గా శ్వాస పీల్చుకోవడం లేదనే భ్రమలో పడిపోతారు.

అధిక బరువు వల్ల: అధిక బరువు ఉంటే శరీరం తన సాధారణ విధులను నిర్వర్తించడానికి మరింత ప్రయత్నం చేయాల్సి వస్తుంది. అధిక కొవ్వు వల్ల డయాఫ్రమ్, ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పడుతుంది. ఇది ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. దీంతో ఏ కొంచెం శారీరక శ్రమ చేసినా శ్వాస సరిపోని పరిస్థితి తలెత్తుతుంది.

# ఆహారంలో ఇవి చేర్చుకోండి.. మంచి నిద్రపోండి..

కొంతమందికి రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పట్టదు. అనారోగ్య సమస్యలున్న వారు డాక్టరు చెప్పిన పద్ధతులు పాటిస్తారు. అయితే ఆరోగ్యంగా ఉన్న వాళ్లు కూడా ఈ సమస్యతో బాధపడుతుంటారు. అటువంటి వారు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే మంచి నిద్రని పొందవచ్చు. ఆర్థికంగా భారమైనా వీటిని చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. పాలకూరలో మెగ్నీషియంతో పాటు ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు ఒత్తిడిని తగ్గించి మనసును ప్రశాంతం చేయడంలో సహాయపడతాయి. అందుకే రోజూ పాలకూర తినడం మంచి నిద్రకు దారి తీస్తుంది. పాలకూర వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి శరీరం స్థిరంగా ఉంటుంది. బాదం గింజల్లో పోషకాలు చాలా ఉంటాయి. వీటిలో మెగ్నీషియం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్ అందుతాయి. రోజూ కొద్దిగా బాదం గింజలు తినడం వల్ల మెదడు కూడా చురుగ్గా మారుతుంది. అంతేకాకుండా ఇందులో ఉన్న ఆరోగ్యకరమైన కొవ్వులు మంచి నిద్రకు సహాయపడతా యి. అందుకే నిద్ర సమస్యలు ఉన్నవారు బాదం తినడం అలవాటు చేసుకోవాలి. అవకాడో పండులో కూడా మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియంతో నిండి ఉంటుంది. అవకాడో తినడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి శరీరంలోని రసాయనాలు సరిగ్గా పనిచేస్తాయి. ఫలితంగా మంచి నిద్ర వచ్చే అవకా శం ఉంటుంది. గుమ్మడి గింజలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కండరాలు రిలాక్స్ అవు తాయి. మానసిక ఒత్తిడి తగ్గి నిద్ర మెరుగుపడుతుంది. గుమ్మడి గింజలు నిద్ర సమస్యలకు ఒక సహజమైన పరిష్కారం. క్వినోవా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ అధికంగా కలిగిన ఆహారం. ఇవి తినడం వల్ల శరీరంలో చక్కెర స్థాయిలు అదుపులో




ఉంటాయి. మంచి నిద్రకు కూడా సహాయ పడుతుంది. ఇది శరీరశక్తిని పెంచడంలో కూడా మేలు చేస్తుంది. బ్లాక్ బీన్స్‌లో కూడా మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్ మంచి మోతాదులో ఉంటాయి. ఈ బీన్స్‌ను సలాడ్, సూప్,కూరలలో వేసితినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి నిద్రకు సహాయపడతాయి. అరటి పండులో కూడా


మెగ్నీషియం ఉంటుంది. ఇందులో పొటాషియం అధికంగా ఉండటం వల్ల కండరాలను రిలాక్స్ చేసి శరీర ఒత్తిడిని తగ్గిస్తుంది. దాంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిద్ర మరింత హాయిగా వస్తుంది. సాల్మన్ చేపల్లో మెగ్నీషియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి నిద్ర నాణ్యతను పెంచడంలో సహాయపడతాయి. ఈ చేపలు తినడం వల్ల శరీరం, మనస్సు రెండూ బాగా విశ్రాంతి పొందుతాయి. ఈ విధంగా మెగ్నీషియం ఉన్న ఆహారాలు మంచి నిద్రను అందించి ఆరోగ్యానికి తోడ్పడతాయి.

# లెట్స్ పిల్లో టాక్!

ప్రస్తుతం భార్యాభర్త.. ఇద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు. ఓవైపు ఆఫీస్.. ఇంటి పనులంటూ ఉరుకులు పరుగులు. మరోవైపు పిల్లలు, వారి చదువులు. పెద్దవాళ్ల బాధ్యతలు! వెరసి.. క్షణం తీరికలేని జీవితాలు! దంపతులకు కాస్తంత సమయం దొరకడం కూడా గగనమే అవుతున్నది.ఒకవేళ దొరికినా.. ఇద్దరూ ఏకాంతంగా గడపడం కూడా కష్టంగా మారుతున్నది. ఫలితంగా..భార్యాభర్తల మధ్యదూరం పెరుగుతున్నది. ఈ సమస్యకు ‘పిల్లో టాక్’ ఓ పరిష్కారం చూపుతున్నది.

దంపతులు ఎంత సన్నిహితంగా ఉంటే.. వారి మధ్య బంధం అంత బలంగా ఉంటుంది. మనసు విప్పి మాట్లాడుకుంటేనే.. సాన్నిహిత్యం పెరుగుతుంది. కానీ, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో చాలామందికి అలాంటి సమయం దొరకడం లేదు. దొరికినా.. కొంతమంది తమ భాగస్వామితో అన్ని విషయాల్నీ స్వేచ్ఛగా చెప్పుకోలేకపోతున్నారట. తమ ఇష్టాయిష్టాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి పంచుకోవడానికీ ఆసక్తి చూపించడం లేదట. చెబితే భాగస్వామి ఎలా రియాక్ట్ అవుతారో.. తమ ఇష్టాయిష్టాలు, లక్ష్యాలను గౌరవిస్తారో లేదోనన్న సందిగ్ధమే ఇందుకు కారణమని నిపుణులు అంటున్నారు. ఇలాంటి వాళ్లు ‘పిల్లో టాక్’తో ఒక్కటవ్వొచ్చని చెబుతున్నారు.

మనసులు దగ్గర..: రాత్రిపూట పడకగదిలో భార్యాభర్తలు ఇద్దరూ ఏకాంతంగా, మనసు విప్పి మాట్లాడుకోవడమే.. పిల్లో టాక్! దీనివల్ల భార్యాభర్తల శరీరాల్లో ‘ఆక్సిటోసిన్’ అనే ప్రేమ హార్మోన్ విడుదలవుతుంది. ఇది మానసిక సమస్యలను దూరం చేస్తుంది. మనసుకు ప్రశాంతత చేకూరుస్తుంది. దంపతుల మధ్య దూరం తగ్గడంతోపాటు ఒకరినొకరు అర్థం చేసుకునే సమయం చిక్కుతుంది. భాగస్వామి మనసులో కోరికలు తెలుసుకోవడంతోపాటు వాటిని నెరవేర్చడానికీ



అవకాశం ఉంటుంది. అందుకే.. భార్యాభర్తలు రోజంతా ఎంత బిజీగా ఉన్నా.. రాత్రిపూట కనీసం ఓ అరగంటైనా మనసు విప్పి, ఏకాంతంగా మాట్లాడుకోవాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

ఇవి వద్దే వద్దు..: అయితే, చాలామంది ‘పిల్లో టాక్’లో లేనిపోని సమస్యలను ముందేసుకుంటారు. దొరక్కదొరక్క దొరికిన సమయాన్ని దుర్వినియోగం చేసుకుంటారు. ఎప్పుడో జరిగిన గొడవలు, ఆఫీస్ సమస్యలు, పిల్లల చదువులు, పెద్దల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను చర్చిస్తుంటారు. ఇలాంటి చర్చలవల్ల సరదాగా సాగాల్సిన సమయం.. వృథాగా గడిచిపోతుంది.

ఒక్కోసారి పాతగొడవలు ముందుకొచ్చి.. దంపతుల మధ్య దూరం పెరిగే ప్రమాదమూ ఉంటుంది. వాటికి బదులుగా పెళ్లినాటి జ్ఞాపకాలు, హనీమూన్ మధురానుభూతులు, ఇచ్చిపుచ్చుకున్న కానుకలు, ఇద్దరి మధ్య జరిగిన సరదా సంఘటనలు.. ఇలాంటివి గుర్తుకు తెచ్చుకుంటే మంచిది. ఇలాంటి సంభాషణలతో ఇద్దరి మధ్య అనుబంధం మరింత దృఢంగా మారుతుంది.

### ట్రేడింగ్‌లో మెళకువలంటూ..

# 1.36 కోట్లు కొట్టేశారు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ట్రేడింగ్‌లో మెళకువలు చెబుతామంటూ సైబర్ నేరాల ముఠా ఓ ఐటీ ఉద్యోగిని నుంచి 1.36 కోట్లు దోచుకున్నారు. నగరంలో కమలానగర్‌కు చెందిన ఓ ఐటీ ఉద్యోగిని సెప్టెంబర్ నెలలో ఫేస్‌బుక్‌లో ఒక లింక్‌ను క్లిక్ చేసింది. బీఓబీక్యాప్స్ ఇన్ఫర్మేషన్ లర్నింగ్ గ్రూప్స్(ఎఫ్516) పేరుతో ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌కు నెంబర్ యాడ్ అయ్యింది. అందులో ఇద్దరు సైబర్ దొంగలు మారు పేర్లతో వేర్వేరుగా మాట్లాడారు. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ఎలా? ఏ స్టాక్స్ ఎలాంటి లాభాలొస్తాయనే విషయంలో మెళకువలు చెబుతామంటూ యూజర్ ఐడీ ఇచ్చారు. దీంతో బీవోబీక్యాప్స్ క్యూల్‌బి- ఇన్.కామ్ పేరుతో ఉన్న లింక్‌ను పంపించి అందులో ఖాతాను క్రియేట్ చేసుకొని రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టింది. దీంతో కొన్ని లాభాలు వచ్చాయి, అందులో నుంచి వెయ్యి రూపాయలు విత్ డ్రా చేసుకుంది. దీంతో సదరు ఐటీ ఉద్యోగినికి ఇదంతా నమ్మకమైన వ్యవహారమే అనిపించింది. వారం రోజుల తరువాత 'మీకు ట్రూ అల్టా బయో ఎనర్జీ ఐపీఓ ఓపెన్ అయ్యింది, మీరు వెంటనే ఇన్వెస్ట్ చేయండి, అందులో మేం కూడా కొంత ఫండింగ్ చేస్తాం' అంటూ నమ్మించారు. దీంతో రూ. 53.96 లక్షలు, రూ.68 లక్షలు మరోసారి ఇలా రెండు సార్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో స్క్రీన్‌పై రూ. 2 కోట్ల లాభం కన్పించింది. అందులో నుంచి కొంత డబ్బు విత్ డ్రా చేసుకోవడానికి ఆమె ప్రయత్నించింది. తమకు రూ.31 లక్షల కమిషన్ చెల్లించిన తరువాత డబ్బు విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తామని సైబర్‌నేరగాళ్లు సూచించారు. అకౌంట్లో ఉన్న డబ్బులో మినహాయించుకొని తమకు రావాల్సింది ఇవ్వాలంటూ బాధితురాలు కోరగా అందుకు వారు నిరాకరించారు. కాగా అదే సమయంలో జనరల్ అట్లాంటిక్(బీఎఫ్04) అనే స్టాక్ ట్రేడింగ్ గ్రూప్‌లోను బాధితురాలు ఇన్వెస్ట్ చేసింది. రూ. 2 లక్షలు డిపాజిట్ చేయడంతో కొంత లాభం రావడంతో వెంటనే రూ. 34 లక్షలు పెట్టుబడి పెట్టింది. అందులో కొంత డబ్బు విత్ డ్రా చేసుకోగా మరికొంత డబ్బు అందులోనే ఉంది. కాగా రుబికాన్ రిసర్చ్ లిమిటెడ్ ఐపీఓ షేర్స్ ఉన్నాయని వాటిలో పెట్టుబడి పెట్టాలంటూ మరికొంత ఇన్వెస్ట్ చేయిం చారు. ఇక్కడ కూడా తన డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్ని చడంతో సైబర్‌నేరగాళ్లు నిరాకరించారు. ఇలా రెండు ఫ్లాట్ ఫామ్స్‌పై రూ. 1.55 కోట్లు పెట్టుబడి పెట్టడంతో రూ. 19 లక్షలు బాధితురాలు తిరిగి రాబట్టుకోగా రూ. 1.36 కోట్లు సైబర్‌నేరగాళ్లు కాజేశారు. దీనిపై బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# గాడిన పడుతున్న ఐటీ రంగం..

## భారీగా పెరిగిన నియామకాలు

- భారత ఐటీ రంగంలో మళ్లీ పుంజుకున్న నియామకాలు
- గతేడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 27 శాతం వృద్ధి
- ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీల ప్రత్యేక దృష్టి, 25 శాతం పెరుగుదల
- ఉద్యోగుల జీతాల్లోనూ సగటున 5 శాతం పెరుగుదల నమోదు
- విశాఖపట్నం వంటి చిన్న నగరాల్లోనూ పెరిగిన ఐటీ అవకాశాలు
- ఏఐ, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు తీవ్ర కొరత, భారీ డిమాండ్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**నిన్నమొన్నటి వరకు నిరాశలో ఉన్న భారత ఐటీ రంగానికి కొత్త ఊపు వచ్చింది. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్లకు ఇది నిజంగా శుభవార్తే. ప్రాజెక్టులు పుంజుకోవడంతో కంపెనీలు మళ్లీ నియామకాల బాట పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఏకంగా 27 శాతం పెరిగాయని మానవ వనరుల సేవల సంస్థ 'అడెకో ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగంతో పోలిస్తే ఈసారి నియామకాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీలు దృష్టి సారించడం సానుకూల పరిణామం. ఫ్రెషర్ల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగాయి. అయితే, కంపెనీలు తమ నియామక వ్యూహాన్ని మార్చుకున్నాయి. కేవలం పేరున్న ఇంజనీరింగ్, టెక్నికల్ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి అధునాతన నైపుణ్యాలు ఉన్నవారికే అవకాశాలు కల్పిస్తున్నాయి. గతంలో మాదిరిగా ఆఫర్ లెటర్ ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా, అవసరమైన నైపుణ్యాలపై కాలేజీల్లోనే శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయని అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప వివరించారు. నియామకాలతో పాటు ఉద్యోగుల జీతాల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 5 శాతం పెరిగాయి. మరోవైపు, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక విభాగాల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. ఈ రంగాల్లో 45 నుంచి 50 శాతం వరకు నైపుణ్యం ఉన్నవారి కొరత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతంలో బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి పెద్ద నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు ఇప్పుడు విశాఖపట్నం, ఇండోర్, కోయం బత్తూర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి సారిస్తున్నాయి. ఈ నగరాల్లో నియామకాలు 7 శాతం పెరిగాయి. అయినప్పటికీ, ఇప్పటికీ ప్రధాన నియామకాలు పెద్ద నగరాల్లోనే జరుగుతున్నాయి. సుమారు 50 ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు అడెకో ఇండియా తెలిపింది.

# క్లౌడ్ స్టోరేజ్ సేఫ్టీ ఎంత

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**నేటి డిజిటల్ యుగంలో, ప్రతి ఒక్కరికీ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, యాప్ డేటా పుష్కలంగా ఉంటాయి. అయితే, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో పరిమిత స్టోరేజ్ కారణంగా.. ప్రతిదీ ఒకే చోట నిల్వ చేయడం అసాధ్యం. క్లౌడ్ స్టోరేజ్ ఆధునిక, సురక్షితమైన పరిష్కారంగా ఉద్భవించింది. క్లౌడ్ స్టోరేజ్ అంటే మీ డిజిటల్ ఫైల్‌లను ఇంటర్నెట్ ద్వారా రిమోట్ సర్వర్‌లో నిల్వ చేయడం. దీని అర్థం మీ ఫోటోలు, వీడియోలు మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో కాకుండా కంపెనీ డేటా సెంటర్‌లో నిల్వ చేయడం. ఈ డేటా సెంటర్ వేలకొద్దీ శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్‌లతో రూపొందించడం జరిగింది. ఇవి మీ డేటాను సురక్షితంగా ఉంచుతూ 24 గంటలూ పనిచేస్తాయి.మీరు గూగల్ డ్రైవ్, ఐక్లౌడ్, డ్రాప్ బాక్స్ వంటి క్లౌడ్ సేవను ఉపయోగించినప్పుడు, మీ ఫైల్ ఇంటర్నెట్ ద్వారా ఆ కంపెనీ సర్వర్‌లకు వెళుతుంది. అక్కడ, ఫైల్ చిన్న డేటా బ్లాక్‌లుగా విభజించబడి బహుళ సర్వర్‌లలో నిల్వ చేయడం జరుగుతుంది. ఒక సర్వర్ సాంకేతిక వైఫల్యాన్ని ఎదుర్కొంటే, మీ డేటాను మరొక సర్వర్ నుండి సులభంగా తిరిగి పొందగలిగేలా ఇది పని చేస్తుంది. దీనిని డేటా రిడెండెన్సీ అంటారు. తరువాత, మీరు అదే ఫైల్‌ను మళ్ళీ తెరిచినప్పుడు, సిస్టమ్ ఈ డేటా బ్లాక్‌లన్నింటినీ కలిపి మీకు పూర్తి ఫైల్‌ను చూపుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు కొన్ని సెకన్లు పడుతుంది. మీ ఫైల్ అక్కడే ఉన్నట్లు, క్లౌడ్‌లో సురక్షితంగా ఉన్నట్లు మీకు అనిపిస్తుంది.క్లౌడ్ కంపెనీలు తమ సర్వర్లలో నిల్వ చేసిన డేటాను ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ఉపయోగించి రక్షిస్తాయి. దీని అర్థం మీ ఫైల్‌లు కోడెడ్ రూపంలో నిల్వ చేయడం జరుగుతుంది. వీటిని తెలియని వారు చదవలేరు. యాక్సెస్ చేయలేరు. లాగిన్ ఆధారాలు, యాక్సెస్ అనుమతులు ఉన్న వినియోగదారులు మాత్రమే ఫైల్‌లను తెరవగలరు. అదనంగా, కంపెనీలు బహుళ-పొర భద్రత, ఫైర్‌వాల్‌లు, సాధారణ బ్యాకప్ వ్యవస్థలను ఉపయోగించి డేటా హ్యాకింగ్ లేదా నష్టం నుండి రక్షించినట్లు నిర్ధారించుకుంటాయి. వేగవంతమైన, నమ్మదగిన సేవలను అందించడానికి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో తమ డేటా సెంటర్లను నిర్మించారు. ఉదాహరణకు, గూగుల్ అమెరికా, సింగపూర్, ఐర్లాండ్, భారతదేశం వంటి దేశాలలో డేటా సెంటర్లను కలిగి ఉంది. అదేవిధంగా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ కూడా వారి స్వంత విస్తారమైన సర్వర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్నాయి. ఇవి 24 గంటలూ డేటాను నిల్వ చేసి నిర్వహిస్తాయి.క్లౌడ్ స్టోరేజ్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు మీ పరికరంలో డేటా స్టోరేజ్ ఖాళీ చేయవలసిన అవసరం లేదు. మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నా లేదా మీ ల్యాప్‌టాప్ క్రాష్ అయినా, మీ డేటా ఇంటర్నెట్‌లో సురక్షితంగా ఉంటుంది.


# 5 వేల ఎకరాల్లో వక్క సాగు



**అనంతపురం,తెలంగాణ దిశ :**అనంతపురం రైతులు వక్క సాగుతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ఒక్కసారి నాటితే వందేళ్ల పాటు దిగుబడినిచ్చే ఈ పంటతో ఎకరాకు రూ.4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నారు. చల్లని వాతావరణ ఈ పంట సాగుకు అనుకూలం అంటున్నారు రైతులు.వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం ఆడటం లాంటిదే. వాతావరణం మొదలు వాడే విత్తనాలు, వేసే మందులు ఇలా ప్రతిది పంట దిగుబడి మీద ప్రభావం చూపుతాయి. ఒకవేళ అన్ని కలిసి వస్తే.. మార్కెట్‌లో ధర ఉండదు. అయితే ఈ సమస్య ఎక్కువగా సంప్రాదాయ పంటల సాగు విషయంలోనే ఎదురవుతుంది. అలా కాకుండా కాస్త భిన్నంగా ఆలోచించి... ఇతర పంటల సాగు మీద రైతులు దృష్టి సారిస్తే.. పెట్టుబడి ఖర్చులు కలిసి రావడం మాత్రమేకాకఏళ్ల తరబడి ఆదాయం పొందేందుకు కూడా అవకాశం ఉంటుంది. అనంతపురం రైతులు ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఒక్కసారి సాగు చేస్తే.. వందేళ్ల పాటు దిగుబడి ఇచ్చే పంటల సాగును ఎంచుకున్నారు...ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల జీవితాల్లో వక్క సాగు వెలుగులు నింపు తుంది. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు పలువురు రైతులు. మరీ ముఖ్యంగా జిల్లాలోని అగళి, అమరాపురం, కుందుర్పి, మడకశిరి, గుడిబండ, కళ్యాణదుర్గం, శెట్టూరు వంటి మండలాల్లో.. దాదాపు 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వక్క సాగుకు అనుకూలమైన వాతావరణం ఉండటమే కాక.. ఈ రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంట సాగు చేస్తూ.., తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తూ.. ఆర్థికంగా ఎదుగుతున్నారు.నీటి వసతి పుష్కలంగా ఉన్న ఏ నేలలో అయినా వక్కనుపండించవచ్చు. ఒక్కసారి ఈ పంటను నాటితే వందేళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు400-500 మొక్కలు నాటుకో వచ్చు. రెండేళ్ల వయసున్న మొక్కలను నాటితే కేవలం నాలుగు సంవత్సరాల్లోనే పంట చేతికి వస్తుంది. ఆగస్టు నుంచి జనవరి వరకు మొత్తం 5విడతల్లో పంట కోస్తారు.చల్లటి వాతావరణం వక్క దిగుబడిని పెంచుతుంది అంటున్నారు రైతులు. అందుకే వారు వక్క పంట చుట్టూ..అవిస, బూరమొక్కలను నాటుతున్నారు. దీని వల్ల వాతావర ణం చల్లగా ఉంటుంది. ఇక పంట సాగులో.. పశువుల పేడ, సేంద్రి య ఎరువులువాడితే అదిక దిగుబడివచ్చి.. మంచి లాభాలు వస్తాయం టున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అగళి, అమరాపురం మండలాల్లో.. 60 నుంచి 100 ఏళ్ల వయసున్న తోటల్లో ఇప్పటికి కూడా దిగుబడి తగ్గలేదని రైతులు చెప్పుకొచ్చారు.వక్క సాగు విషయానికి వస్తే.. ఈ మొక్కలు నాటడానికి ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఇకఆదాయం విషయానికివస్తే.. బయటక బహిరం గ మార్కెట్‌లో క్వింటాల్ వక్క ధర రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది.

ఎకరాకు ఎంత లేదన్నా.. 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.4 లక్షలవరకు ఆదాయం వస్తుంది. వక్కతో పాటు మిరియాలు, తమలపాకులు అంతర పంటలుగా సాగు చేస్తే అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది అంటున్నారు ఈ పంటను సాగు చేస్తున్న రైతులు. వక్కను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయే గుజ్జును కిలో రూ.150 చొప్పున అమ్ముతున్నారు. వక్క మట్టలతో ప్లేట్లు తయారు చేయడం వల్ల స్థానికులకు ఉపాధి లభిస్తోంది. కనుక రైతులు ఇలాంటి ప్రత్యామ్నయం పంటల సాగు మీద దృష్టి సారించాలంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు.

# అడ్డూఅదుపులేని బంగారం ధరలు



### తులం ధర మరో మూడువేలు పెరుగుదల

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగలశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. ఔన్సు వెండి ధర 51 డాలర్ల పైనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా టారిఫ్‌లు, డాలర్ విలువ తగ్గిపోతుండటం వంటి పరిణామాలతో పసిడిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక, పలు దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్ ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసంవిశాఖలోస్థల పరిశీలన జరుగు తోంది.గూగుల్ సంస్థ ప్రతినిధులువిశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు. గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు.త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి 2028-32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

# రాంపూర్ గ్రామ ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు..




**హుజురాబాద్,తెలంగాణ దిశ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డా. గోసి కొండ శ్రీరాములు అంత ర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. వారణాసిలోని ప్రతిష్టాత్మక బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా. శ్రీరాములు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్వదేశీ నిర్వహణ మరియు సంస్థాగత అధ్యయనాల అంతర్జాతీయ అకాడమీ కాన్ఫరెన్స్ 2025లో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రపంచ సదస్సులో భారతదేశం నుండి పాల్గొన్న ఏకైక పరిశోధకులు డాక్టర్ శ్రీరాములు గోసికొండ కావడం విశేషం. కెనడా, బ్రెజిల్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫిన్లాండ్, న్యూజిలాండ్ వంటి వివిధ దేశాల నుండి హాజరైన దాదాపు 60 మంది ప్రతినిధుల సమక్షంలో ఆయన భారతీయ పరిశోధనను సమర్పించారు. డా. శ్రీరాములు "భారతదేశంలో రహస్యంగా జరిగే ఆధిపత్యాన్ని సినిమాగా ప్రదర్శించడం, గిరిజనుల ఉనికి, రాష్ట్రాధికారం, మరియు సాంస్కృతిక సంఘర్షణ మీద ఒక అన్వేషణ" అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఈ లోతైన అధ్యయనం ప్రముఖ చిత్రం 'కాంతారా'పై సామాజిక శాస్త్ర దృక్పథాన్ని స్పృశిస్తూ, గిరిజన గుర్తింపు, ప్రభుత్వ అధికారం మరియు సాంస్కృతిక రాజకీయాల సమ్మేళనాన్ని విశ్లేషిస్తుంది. ఆయన అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం మన కరీంనగర్ జిల్లాకు గర్వకారణం. స్వదేశీ సంస్థాగత అధ్యయనాలపై జరుగుతున్న ప్రపంచ చర్చలో డా. శ్రీరాములు చేసిన కృషి భారత్‌కు, ప్రత్యేకించి కరీంనగర్ ప్రాంతానికి మరియు బీహెచ్‌యూకు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.



# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

## ఇప్పుడే కొందామా.. ఇంకా ఆగుదామా..?

న్యూఢిల్లీ, : బంగారం, వెండి ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. దేశీయ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) గోల్డ్ రేటు గత వారం మునుపెన్నడూ లేనివిధంగా 10 గ్రాములు రూ.1,34,800 పలికిన విషయం తెలిసిందే. అలాగే కిలో వెండి విలువ కూడా ఆల్‌టైమ్ హైని తాకుతూ 1,85,000గా నమోదైన సంగతీ విదితమే. ఈ క్రమంలో ధరలు కొంతమేర తగ్గినా.. తిరిగి పుంజుకుంటున్నాయి. ముఖ్యంగా ఫ్యూచర్స్ మార్కెట్లలో విజృంభిస్తున్న సంకేతాలనే ఇస్తున్నాయి.

ఇదీ సంగతి..: మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై డిసెంబర్ డెలివరీకిగాను సోమవారం గోల్డ్ ఫ్యూచర్స్ రూ.3,580 లేదా 2.82 శాతం పెరిగి తులం రూ.1,30,588 పలికింది. ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్ వేస్తూ శుక్రవారం రూ.1,27,008కి దిగజారినది తెలిసిందే. అయితే అంతకుముందు రూ.1,32,294 స్థాయిని తాకి ఆల్‌టైమ్ హై రికార్డు నమోదైంది. మళ్లీ ఒక్కరోజు వ్యవధిలో రూ.3,580 పెరిగి మార్కెట్‌లో గోల్డ్ రష్‌కు అద్దం పట్టింది. ఇక డిసెంబర్‌కుగాను సిల్వర్ ఫ్యూచర్స్ రూ.1,571 లేదా 1 శాతం పుంజుకొని కిలో రూ.1,58,175గా నమోదైంది. రికార్డు హై నుంచి ఇది దాదాపు 6 శాతం తక్కువ. అయినప్పటికీ పరిశ్రమల నుంచి డిమాండ్, సరఫరాలో అడ్డంకుల వల్ల ధరలు తిరిగి పరుగులు పెడుతున్నాయి. నిజానికి స్పాట్ మార్కెట్ కంటే ఫ్యూచర్స్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్ ధరలు తక్కువగా ఉంటాయి. అయితే ఫ్యూచర్స్ మార్కెట్ ఆధారంగా స్పాట్ మార్కెట్‌లో ధరలు పెరిగేందుకున్న అవకాశాలను ఒకింత అంచనా వేయవచ్చని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తగ్గుతుందని ఆగవచ్చా?: అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. రాబోయే ద్రవ్యసమీక్షల్లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించబోతున్నదన్న సంకేతాలు.. బాండ్ మార్కెట్లను షేక్ చేస్తున్నాయి. దీంతో మదుపరులకు తమ పెట్టుబడుల రక్షణార్థం కనిపిస్తున్న ఏకైక మార్గం బంగారమే అవుతున్నదని ఆర్థిక, మార్కెట్ నిపుణులు ప్రస్తుత సరళిని విశ్లేషిస్తున్నారు. అందుకే బంగారం ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రపంచ స్థాయిలో డిసెంబర్ డెలివరీకిగాను ప్రధాన ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ మార్కెట్ కొమెక్స్‌లోనూ గోల్డ్ 62.46 డాలర్లు లేదా 1.48 శాతం ఎగబాకి ఔన్స్ 4,275.76 డాలర్లు పలికింది. సిల్వర్ 1.5 శాతం ఎగసి ఔన్స్ 50.85 డాలర్లు పుంజుకున్నది. ఈ నేపథ్యంలో సాధారణ కొనుగోలుదారులు.. పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాల కోసమైతే అవసరాన్నిబట్టి బంగారాన్ని కొనుగోలు చేసుకోవచ్చని మార్కెట్ ఎక్స్‌పర్ట్స్ సలహా. ఇక మదుపరులు.. ఇప్పుడున్న అధిక ధరల్లో పెద్ద ఎత్తున గోల్డ్‌పై ఇన్వెస్ట్ చేయడం అంత తెలివైన నిర్ణయం కాదని అంటున్నారు. కొద్ది మొత్తాల్లో పెట్టుబడులకు దిగడమే ఉత్తమం అని చెప్తున్నారు.

వెండికి ఎందుకింత డిమాండ్?: ఏడాది క్రితం కిలో రూ.90,000 పలికిన వెండి ధర.. ఇప్పుడు రెట్టింపైంది. ఒకానొక దశలో రూ.2 లక్షలను తాకుతుందన్న అంచనాలూ వినిపించాయి. ఇటీవలికాలంలోనైతే రోజూ రూ.5వేల నుంచి రూ.8వేలు పెరిగిన సందర్భాలుండటం.. మార్కెట్‌లో వెండి గిరాకీకి అద్దం పడుతున్నది. దీనికి పరిశ్రమల నుంచి ఉన్న డిమాండే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. ఎలక్ట్రికల్స్-ఎలక్ట్రానిక్స్, ఆటో-ఎలక్ట్రిక్ వెహికిల్స్, సోలార్ ఎనర్జీ, సెమీకండక్టర్, మెడిసిన్, బ్రేజింగ్ అల్లాయిస్-సోల్డర్స్ తదితర పరిశ్రమల నుంచి వెండికి డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఇక బంగారం ధర కొండెక్కడంతో చాలామంది సిల్వర్ జ్యుయెల్లరీపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. వెండి నగల తయారీ బాగా పెరిగింది. అలాగే ఇన్వెస్టర్లు, ముఖ్యంగా బ్యాంకులు పసిడి నిల్వలతోపాటు వెండి నిల్వలనూ పెంచుకుంటున్నాయి. ఈ కారణాల చేతనే వెండి ఆదరణ ఎక్కువైందని బులియన్, నగల వర్తకులు పేర్కొంటున్నారు.

# నాచగిరిలో... గిరి ప్రదక్షిణ




**వర్గల్,తెలంగాణ దిశ :** వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా గిరి ప్రదక్షిణను రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండోసారి ప్రదక్షిణలో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో రెండుసార్లు గిరి ప్రదక్షిణ రావడం భక్తుల అదృష్టం అని అన్నారు. గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మాలదారులు, ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు, స్వామివారిభక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంలో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం స్వామివారి పురవీధులలో లక్ష్మీనృసింహ నామస్మరణతో ర్యాలీ నిర్వహించగా, అది విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమా లను చైర్మన్ రవీందర్, ఈవో విజయరామారావు, అర్చక సిబ్బంది పర్యవేక్షిస్తూ విజయవంతంగా ముందుకు నడిపించారు.

# ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రభుత్వ బడి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల రాష్ట్రంలోనే తొలి 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీపీఎస్) గా రూపుదిద్దుకుంటోంది. నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన, సెమి రెసిడెన్షియల్ సౌకర్యాలతో ఈ పాఠశాల అంతర్జాతీయ స్థాయిని తలపిస్తోంది. ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో ఇక్కడ చేరడం విశేషం.తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచాలనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల నిలుస్తోంది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ' తెలంగాణ పబ్లిక్ స్కూల్ ' (టీపీఎస్) గా రూపుదిద్దుకుంటున్న ఈ పాఠశాల నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఒకే ప్రాంగణంలో పూర్తిస్థాయి ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తూ ఇంటర్నేషనల్ స్కూల్‌ను తలపిస్తోంది.ప్రతి మండలంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను టీపీఎస్‌లుగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా.. పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లాలో ఆరుట్ల, మంచాల పాఠశాలలను. నాగర్‌కర్నూల్ జిల్లాలో వంగూరు, పోల్కమ్‌పల్లి హైస్కూళ్లను ఎంపిక చేశారు. ఆరుట్ల పాఠశాల అభివృద్ధికి సోషల్ డెమోక్రటిక్ ఫోరమ్ (ఎస్‌డీఎఫ్) నుంచి దాదాపు రూ.3 కోట్లు విరాళంగా అందగా.. ఆ నిధులతో దాదాపు ఐదు ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు సెమీ రెసిడెన్షియల్ తరహాలో పనిచేస్తాయి. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. నర్సరీలో చేరిన విద్యార్థులు పదో తరగతి లేదా ఇంటర్ వరకు ఇక్కడే చదువుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఇతర గ్రామాల విద్యార్థుల కోసం బస్సులు, నాణ్యమైన విద్యతో పాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇస్తారు. సైన్స్, గణితం, ఆంగ్ల ల్యాబ్‌లు, అంతర్జాతీయ స్థాయి పాఠశాలల్లో ఉండే అన్ని సౌకర్యాలు ఇక్కడ కల్పిస్తున్నారు. ప్రీ ప్రైమరీ చిన్నారులకు ప్రత్యేక క్రీడా స్థలం ఏర్పాటు చేశారు.గత ఏడాది వరకు కేవలం 760 మంది విద్యార్థులు ఉన్న ఈ ప్రాంగణంలో.. టీపీఎస్ ప్రకటన ప్రభావంతో ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య దాదాపు 1,600కి పెరిగింది. కొత్తగా చేరిన వారిలో 80 శాతానికి పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి వచ్చిన వారే కావడం విశేషం. సుమారు 80 మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు కూడా ఇక్కడే చేరారు. ప్రస్తుతం మూడు బస్సులు కొనుగోలు చేయగా.. మరికొన్ని సమకూర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.టీపీఎస్‌లను తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం తెలంగాణ విద్యా కమిషన్‌కు అప్పగించగా.. కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆరుట్ల పాఠశాలకు రూ.9.86 కోట్లు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఉపాధి హామీ పథకం కింద కేవలం రూ.కోటి మాత్రమే విడుదలైంది. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేస్తే డైనింగ్ హాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తిచేయవచ్చని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కోరుతున్నారు. మిగిలిన మూడు పైలట్ పాఠశాలల నిర్మాణానికి కూడా ఆర్కిటెక్ట్‌లు డిజైన్లు రూపొందిస్తున్నారు.

# హైదరాబాద్‌లో మారుతున్న ఐటీ స్వరూపం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో స్వర్ణయుగం ముగిసి, ఒత్తిడి పెరిగింది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కృత్రిమ మేధస్సు రాకతో ఉద్యోగాల తొలగింపులు, కొత్త నియామకాల లేమి ఏర్పడ్డాయి. టీసీఎస్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఖర్చులను తగ్గించుకోవడానికి.. ఏఐ లో పెట్టుబడులు పెంచడానికి ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ పరిస్థితిలో నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకోనిదే ఉద్యోగ భద్రత కష్టమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కొన్ని సంవత్సరాల క్రితం వరకు.. హైదరాబాద్ నగరంలోని ఐటీ ఉద్యోగుల జీవితం ఒక సుస్థిర స్వర్ణయుగంలా ఉండేది. వారానికి ఐదు రోజులు మాత్రమే పని.. భారీ వేతనాలు.. తరచూ బోనస్‌లు, వేతన పెరుగుదల వంటి అద్భుత అవకాశాలు ఉండేవి. కంపెనీలు మారితే చాలు, జీతాలు ఆకాశాన్ని తాకేవి. వివాహ సంబంధాల కోసం ఐటీ ఉద్యోగుల వెనుక క్యూ కట్టేవారు. కానీ.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా తలకిందులైంది.మారుతున్న ఆర్థిక పరిస్థితులు , సాంకేతిక సేవలకు తగ్గిన గిరాకీ కారణంగా, హైదరాబాద్ ఐటీ పరిశ్రమ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగాల తొలగింపులు, కొత్త నియామకాల లేమి వంటి సవాళ్లు ఉద్యోగులలో భయాన్ని పెంచుతున్నాయి. కోర్ ఇంజనీరింగ్ విభాగాలలో డిమాండ్ తగ్గడంతో.. బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో సాఫ్ట్‌వేర్ రంగం వైపు మళ్లుతున్నారు. నైపుణ్యాలు లేకపోయినా, కోర్సులు చదివే వారి సంఖ్య పెరుగుతున్నా.. అందుకు తగ్గ ఉద్యోగాలు మార్కెట్‌లో లేకపోవడంతో హైదరాబాద్‌లో నిరుద్యోగం పెరిగి, యువతలో నిరాశ ఆవహిస్తోంది.సాంప్రదాయకంగా హైదరాబాద్ స్థిరమైన ఉద్యోగాలకు కేంద్రంగా ఉండేది. కానీ.. ప్రస్తుత అనిశ్చిత వాతావరణం ఉద్యోగుల భద్రతను ప్రశ్నిస్తుందనే చెప్పాలి. ఎంతో మంది బిక్కుబిక్కుబంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు పెద్ద సవాలుగా కృత్రిమ మేధస్సు మారుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఏఐ రాకతో, మానవ శ్రమతో చేసే పనులు ఆటోమేషన్‌కు గురవుతున్నాయి. దీనివల్ల నైపుణ్యం లేనివారు.. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా తమను తాము అప్ డేట్ చేసుకోని ఎంతటి అనుభవం ఉన్న ఉద్యోగి అయినా ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది.దేశంలోని అతిపెద్ద సాంకేతిక సంస్థల్లో ఒకటైన టీసీఎస్ సైతం, ఆటోమేషన్ యుగానికి మారలేని ఉద్యోగులను వెనక్కి పంపిస్తోంది. ప్రపంచ దిగ్గజ సంస్థలు అయిన గూగుల్ వంటివి కూడా ఖర్చులు తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగించడం అనేది, తమ పెట్టుబడులను కృత్రిమ మేధస్సు వంటి అత్యంత కీలకంగా భావించే రంగాలకు తరలించడానికి చేపట్టిన వ్యూహాత్మక పునర్నిర్మాణంగా చెప్పుకోవచ్చు. డేటా విశ్లేషణ, పాత ప్లాట్‌ఫామ్ డిజైన్ వంటి సాంప్రదాయ ఉద్యోగాలు వేగంగా ఆటోమేషన్ అవుతున్నాయి. కాబట్టి.. ప్రస్తుతం ఉద్యోగులు నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత చాలా ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు.



# పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### -బీసీ సంఘం నేత పంతకాని శ్రీనివాస్ నేత

**మంథని,తెలంగాణ దిశ :** బీసీల ఆరాధ్య దైవం ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ నేత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం అర్ధరాత్రి వరంగల్ లోని ఉర్సు కరీమాబాద్ దర్గా ప్రాంతంలోని ఆటో స్టాండ్ వద్ద మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వంగరి రాహుల్ ని కఠినంగా శిక్షించడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా చూడాలని, బీసీ ఉద్యమం బీసీ రిజర్వేషన్ల అంశం కీలక దశలో ఉన్న ఈ సమయంలో ఈ సంఘటన జరగడంతో ఏమైనా కుట్ర కోణం దాగి ఉందా అని లోతుగా విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని, గతంలో ఒకసారి ఈ విగ్రహాన్ని ధ్వంసం చేయగా మిల్స్ కాలనీ పోలీసులు చొరవ తీసుకొని తిరిగి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించగా ఆ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేయడం హేయమైన చర్య అని నిందితుడుని కఠినంగా శిక్షించడంతోపాటు ప్రభుత్వమే తిరిగి కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పంతకాని శ్రీనివాస్ హెచ్చరించారు.

# సీఎంగా ఆయనకే మద్దతు

## కానీ...స్థానిక ఎన్నికల్లో మాత్రం..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**బిసి రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఆగిపోయాయి. కానీ తెలంగాణ రాజకీ యాలు మాత్రం హాట్ హాట్ గా సాగుతున్నాయి. దీనికి ప్రధాన కార ణం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఉప ఎన్నికలు. ఈ నియోజక వర్గంలో మొన్నటిదాకా ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ అనారో గ్యం వల్ల కన్నుమూశారు. దీంతో ఈ నియోజకవర్గంలో అనివార్యంగా ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఉపఎన్నిక అటు భారత రాష్ట్ర సమితికి.. ఇటు అధికార కాంగ్రెస్ పార్టీకి సవాల్ గా నిలిచింది. దీంతో రెండు పార్టీలు హోరా హోరీగా పోరాడుతున్నాయి. బిజెపి తన అభ్యర్థిని పోటీలో నిలిపినప్పటికీ.. ప్రధాన పోరు మాత్రం కాంగ్రెస్, గులాబీ పార్టీ మధ్యలోనే ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు.గులాబీ పార్టీ తన అభ్యర్థిగా మాగంటి సునీతను రంగంలో నిలిపింది. కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్‌ను పోటీలో ఉంచింది. ఈ రెండు పార్టీలు గెలుపు ను అత్యంత సవాల్ గా తీసుకున్న నేపథ్యంలో పోటీ హోరా హోరిగా సాగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఈ రెండు పార్టీలు ప్రచారాన్ని వేగవంతం చేశాయి. భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ పోటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలను ఏప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఈ నియోజకవర్గంలో నవీన్ యాదవ్ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన తన గెలుపుపై బలమైన నమ్మకంతో ఉన్నారు. నవీన్ యాదవ్ కు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ మద్దతు పలికారు. దీంతో గెలుపు తనదేనని నవీన్ యాదవ్ చెబుతున్నారు. గెలుపు, ఓటముల విషయం పక్కన పెడితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంది? అక్కడి ఓటర్లు ఏమనుకుంటున్నా రు.. ఎవరు గెలిచే అవకాశం ఉంది.. ఈ అంశాలపై ఆర్ఆర్ పొలిటికల్ సర్వేస్ అనే సంస్థ ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఎవరు ఉండాలనే అంశంపై ప్రజలను అభిప్రాయం కోరితే 33.35% ఉంది సునీతకు జై కొట్టారు. నవీన్‌యాదవ్‌కు ఓటు వేస్తామని 49.55 శాతమంది చెప్పారు.. 12.5 శాతం మంది తెలియదు, చెప్పలేము అనే సమాధానం వెల్లడించారు..పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి అనే అంశాలను ప్రస్తావిస్తే.. రేవంత్ రెడ్డికి అనుకూలంగా 19.79 శాతం మంది, కెసిఆర్ కు అనుకూలంగా 67.70 శాతం మంది సమాధానం చెప్పారు. తెలియదు, చెప్పలేమని 12.5 శాత మంది సమాధానం చెప్పారు.మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా ఎవరికిఉందనే ప్రశ్నకు.. కాంగ్రెస్‌పార్టీకి 18.75 శాతం మంది అనుకూలంగా సమాధానం చెప్పారు.. గులాబీ పార్టీకి అనుకూలంగా 32.44 శాతం మంది, బిజెపికి 3.12 శాతం మంది అనుకూలంగా సమాధానం చెప్పారు. తెలియదు, చెప్పలేమనే సమాధానాన్ని 12.5 మంది చెప్పారు..తెలంగాణ రాష్ట్రంలో తదుపరి ముఖ్యమంత్రిగా ఎవరు ఉండాలనే ప్రశ్నకు రేవంత్ రెడ్డికి అనుకూలంగా 20.3 శాతం మంది, కెసిఆర్ కు 66.66 శాతం మంది, బండి సంజయ్ కి 7.29శాతం మంది, కిషన్‌రెడ్డికి అనుకూలంగా 1.29 శాఖ మంత్రి అనుకూలంగా సమాధానం చెప్పారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీల వారీగా చూసుకుంటే కాంగ్రెస్ పార్టీకి 50.65 శాతం, గులాబీ పార్టీకి 32.46%, బీజేపీ కి 11.99 శాతం, హెచ్ వై సీ కి 1.03 శాతం, ఇతరులు 1.8%,నోటాకు 2.8శాతం మందిఅనుకూలంగా సమాధా నం చెప్పారు..మొత్తంగా ఈ సర్వేలో కేసీఆర్ పరిపాలన కాలంలో సంక్షేమం, అభివృద్ధి పై ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. ఇదే క్రమంలో మాగంటి సునీత పై సానుభూతి ఉన్నప్పటికీ.. ఎందుక నో ప్రజలు ఓటు వేయడానికి నిరాకరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కాలంలో ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నప్పటికీ.. నవీన్ యాదవ్ గతంలో పోటీ చేసి రెండుసార్లు ఓడిపోయిన నేపథ్యంలో సానుభూతి, సామాజిక సేవా కార్యక్రమాల వల్ల ఆయనను ప్రజలు ఆమోదిస్తున్నారు. ఆయన ఈ నియోజకవర్గంలో కులాలతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమయ్యారు. అనేక కార్యక్రమాలు చేపట్టారు.. వాస్తవానికి నవీన్ యాదవ్ కాకుండా మరొకరు గనుక పోటీలో ఉండి ఉంటే కచ్చితంగా కాంగ్రెస్ ఓడిపోయేదని.. కేవలం ఆయన వ్యక్తిగత చరిష్మా వల్ల మాత్రమే ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

# విజయసాయిరెడ్డి యాక్టివ్ పాలిటిక్స్..



**నెల్లూరు,తెలంగాణ దిశ :** మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. రాజకీయాలకు సన్యాసం చెప్పి తాను వ్యవసాయం చూసుకుంటానని చెప్పిన విజయసాయిరెడ్డికి తిరిగి పాలిటిక్స్ పై మోజు పెరిగిందంటున్నారు. ఆయన తన అత్యంత సన్నిహితుడితో కలసి మాట్లాడినప్పుడు ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. అయితే వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి బీజేపీలో చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరిగింది. కానీ సాయిరెడ్డిఇప్పటి వరకూ ఆ పార్టీలో చేరలేదు. బీజేపీ అయినా ఆ యనను కాదనుకుని ఉండాలి. లేకుంటే అది ప్రచారానికే పరిమితమ యి ఉండాలి.కానీ విజయసాయిరెడ్డి ఇప్పుడు ఏ పార్టీలో చేరతారన్నది ఆసక్తికరంగా మారింది. వైసీపీలో చేరే అవకాశాలు ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ మద్యం కేసులో విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకులు కావచ్చు. తర్వాత వైఎస్ షర్మిలతో భేటీ అవ్వడంతో జగన్ పార్టీలోకి రీఎంట్రీ అనేది జరగని పని అని అందరూ అభిప్రాయపడుతున్నారు. అందులో వైఎస్ జగన్ విషయంలో సాయిరెడ్డిని తిరిగి చేర్చుకునేది ఉండకపోవచ్చు. విజయసాయిరెడ్డి చెప్పిన తర్వాత ఏపీ మద్యం కేసులో రాజ్ కేసిరెడ్డి పేరు బయటకు రావడంతో పాటు పలు రకాల ఆరోపణలు చేయడం, జగన్ పై కోటరీ అంటూ విమర్శలు చేయడంతో విజయసాయిరెడ్డిని జగన్ పార్టీలోకి తిరిగి చేర్చుకునే అవకాశాలుండకపోవచ్చు. ఇక విజయసాయిరెడ్డి టీడీపీలో చేరాలనుకున్నప్పటికీ బహుశా చంద్రబాబు నాయుడు అంగీకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్ తో పాటు పార్టీపైన చేసిన విమర్శలను క్యాడర్ ఎవరూ మర్చిపోలేదు. సాయిరెడ్డిని పార్టీలో చేర్చుకుంటే క్యాడర్ నుంచే అసహనం వ్యక్తమయ్యే అవకాశముంది. ఇక ఆయనకు ఏపీలో మిగిలిన పార్టీలు ఒక రెండే రెండు. ఒకటి జనసేన రెండు కాంగ్రెస్. జనసేనలో చేరాలనుకున్నప్పటికీ అది కూడా సాయిరెడ్డికి సాధ్యం కాకపోవచ్చు. చేరినా నామమాత్రపు నేతగానే మిగిలిపోవచ్చు. ఇకపోతే మిగిలింది కాంగ్రెస్ ఒక్కటే. ఏపీలో ఏమీ లేని కాంగ్రెస్ కు వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా ఉండటంతో కీలకంగా మారే అవకాశముంటుంది. షర్మిలకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉంటారన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# మోపిదేవి దారెటు



**గుంటూరు,తెలంగాణ దిశ :**మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ రాజకీయంగా తన పతనాన్ని తానే కొనితెచ్చుకున్నట్లయింది. గత కొన్ని నెలల నుంచి మోపిదేవి మాట కూడా వినిపించడం లేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉండాల్సిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా ఇప్పుడు ఖాళీగా గోళ్లు గిల్లుకుంటూనే ఉన్నారు. మహా అయితే.. రానున్న కాలంలో ఎమ్మెల్సీ పదవి దక్కుతుందేమో కానీ.. టీడీపీ ప్రభుత్వంలో మోపిదేవి వెంకటరమణకు మంత్రి పదవి దక్కడం మాత్రం జరిగే పని కాదు. అందులోనూ రేపల్లెలో తన చిరకాల ప్రత్యర్థి అనగాని సత్యప్రసాద్ ఉన్నప్పుడు మోపిదేవిని బొట్టు పెట్టి పిలిచి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. ఇంతోటి దానికి ఎందుకు రాజీనామా చేసి పార్టీ మారారంటూ అనుచరులే ప్రశ్నిస్తున్నారు.. ఇక రేపల్లె నియోజకవర్గంలోనూ వేలు పెట్టే అవకాశం కూడా మోపిదేవి వెంకటరమణకు గాని, ఆయన అనుచరులకు గాని లేదు. అది అనగాని అడ్డా కావడంతో మోపిదేవి నామమాత్రపు నేతగానే మిగిలిపోయారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ తన పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభకు రాజీనామా చేసి ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలని భావించారు. కొన్ని నెలల నుంచి మోపిదేవి వెంకటరమణ పదవి కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకూ ఐదు ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో మోపిదేవి పేరు కనిపించలేదు. మూడు టీడీపీ, జనసేన, బీజేపీ చెరొక స్థానం తీసుకున్నా మోపిదేవి వెంకటరమణకు మాత్రం ఛాన్స్ రాలేదు. .. రానున్న ఖాళీల తర్వాత ఏదైనా మోపిదేవి వెంకటరమణకు ఛాన్స్ ఉంటే ఉండవచ్చు. కానీ ఎమ్మెల్సీకి మించి మోపిదేవి వెంకటరమణ ఎదగలేరన్నది వాస్తవం. ఎందుకంటే వైసీపీ నుంచి వచ్చిన నేత కావడంతో పాటు జగన్ కు జిగిరీ దోస్త్ కావడంతో చంద్రబాబు నాయుడు అంత తేలికగా మోపిదేవిని నమ్మే అవకాశం లేదు. రాజ్యసభ పదవి త్యాగం చేసినందుకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశముంది. అదీ ఒక్క ఛాన్స్ వరకూ మాత్రమే అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. వైసీపీలో ఉన్న సమయంలో ఓడిపోయినా మంత్రిని చేసి, తర్వాత అనుకోని పరిస్థితుల్లో రాజ్యసభ పదవికి ఎంపిక చేసిన పార్టీని కాదని మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది?

## బెంగళూరులో దారుణం

# వైద్యం పేరుతో యువతిపై డాక్టర్ లైంగిక వేధింపులు

**- పరీక్ష పేరుతో అరగంట పాటు నరకం చూపించిన వైద్యుడు**
**- క్లినిక్ ముందు బాధితురాలి కుటుంబం ఆందోళన**
**- డాక్టర్‌ను అరెస్ట్ చేసి కస్టడీకి తరలించిన పోలీసులు**
**- అపార్థం చేసుకున్నారంటూ ఆరోపణలు ఖండించిన నిందితుడు**

బెంగళూరు: వైద్యుడి చేతిలో ఓ యువతి లైంగిక వేధింపులకు గురైన దారుణ ఘటన బెంగళూరులో వెలుగుచూసింది. చర్మవ్యా ధికి చికిత్స కోసం తన క్లినిక్‌కు వచ్చిన 21 ఏళ్ల యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆరోపణలపై పోలీసులు 56 ఏళ్ల డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలు శనివారం సాయంత్రం డాక్టర్ ప్రవీణ్ ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లింది. సాధారణంగా ఆమె తన తండ్రితో కలిసి క్లినిక్‌కు వస్తుంటుంది, కానీ ఆ రోజు ఆయనకు వీలు కాలేదు. యువతి ఒంటరిగా రావడాన్ని అదునుగా తీసుకున్న డాక్టర్ పరీక్ష పేరుతో ఆమెను అరగంట పాటు లైంగికంగా వేధించినట్టు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.చర్మ ఇన్ఫెక్షన్‌ను పరిశీలించే నెపంతో తనను అసభ్యంగా తాకాడని, బలవంతంగా కౌగిలించుకుని చాలాసార్లు ముద్దు పెట్టాడని ఆమె ఆరోపించింది. ఆమె ప్రతిఘటించినా వినకుండా, పరీక్షలో భాగంగా దుస్తులు విప్పమని బలవంతం చేశాడని తెలిపింది. అంతటితో ఆగకుండా, ఇద్దరూ కలిసి హోటల్ రూమ్‌లో గడుపు



దామంటూ అసభ్యకరమైన ప్రతిపాదన కూడా చేసినట్టు యువతి పోలీసులకు వివరించింది. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు క్లినిక్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న అశోక్ నగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, డాక్టర్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, డాక్టర్ ప్రవీణ్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాను కేవలం వైద్య పరీక్ష మాత్రమే చేశానని, యువతి తన చర్యలను అపార్థం చేసుకుందని వాదించారు. పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్లు 75, 79 కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

# డ్రోన్ హబ్ గా కర్నూలు!

**కర్నూలు,తెలంగాణ దిశ :**కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో ఈ డ్రోన్ హబ్ ఏర్పాటు కానుంది. ఇక్కడ విమానశ్రయం, ఫ్లై జోన్ ఉండటం కారణంగానే ప్రభుత్వం ఓర్వకల్లులో ఈ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అయితే, అందరూ అనుకున్నట్లు ఇది కేవలం డ్రోన్ తయారీ కేంద్రం కాదు. ఇది డ్రోన్‌కు సంబంధించి అన్ని విషయాలకు సమగ్ర కేంద్రంగా నిలవనుంది. ఈ హబ్‌లోనే తయారు చేస్తారు. తయారు చేసిన డ్రోన్లను అన్ని విధాలా పరీక్షించే సదుపాయాలు కల్పిస్తారు. అంతే కాకుండా, వివిధ రకాల సాంకేతికతలను కలబోసి కొత్త తరం డ్రోన్ల తయారీ కోసం పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాలను ఈ డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు డ్రోన్ల మరమ్మతులు స్టేషన్స్ ఉంటాయి. ఇక డ్రోన్లకు అవసరమైన సర్టిఫికేషన్ (ధృవీకరణ) వంటి సదుపాయాలన్నీ ఇక్కడ లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించడమే ఈ డ్రోన్ హబ్ ముఖ్య లక్ష్యం. కర్నూలులోని ఓర్వకల్లులో ఏర్పాటు చేసే డ్రోన్ హబ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది తయారయిన డ్రోన్ల నాణ్యతకు హామీకి, సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుంది. ఇక్కడ డ్రోన్లను తయారు చేయడమే కాదు. వీటిని ఆపరేట్ చేసే డ్రోన్ పైలట్‌లు, టెక్నీషియన్లు, ఇంజనీర్లను తయారు చేయడానికి శిక్షణా అకాడమీలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు నెలకొల్పుతారు. దీని ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఓర్వకల్లు ప్రాంతం కర్నూలు విమానాశ్రయం, జాతీయ రహదారులకు అనుకూలంగా ఉండటమే కాకుండా, హైదరాబాద్-బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామి




కంగా అనుకూలంగా ఉంటుంది. డ్రోన్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయి. కర్నూలులో ఈ డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డ్రోన్ పాలసీ ద్వారా సుమారు వేయి కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో దాదాపు 3 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా. అయితే, ఈ డ్రోన్ సిటీలో ఇప్పటికే డ్రోన్ రంగంలో మంచి పేరున్న సంస్థ గరుడ ఏరోస్పేస్ వంద కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. డ్రోన్ల తయారీ, మరమ్మతులకు సంబంధించిన డ్రోన్-యాజ్-ఎ-సర్వీస్ అందించే అనేక దేశీయ, విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. దీంతో అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ పెట్టుబడులను ఈ డ్రోన్ సిటీలో పెట్టేందుకు చర్చలు ప్రారంభించాయి. డ్రోన్ హబ్ ద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా, ఇక్కడ ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా 25 వేల మందికి డ్రోన్ పైలట్‌లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

# ఏడాది నుంచి జీతాల కోసం ఎదురు చూపులు!

**ఖమ్మం,తెలంగాణ దిశ :**దాదాపు ఏడాది నుంచి ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోయినా గెస్ట్ లెక్చరర్లు అవేమి పట్టించుకోకుండా పాఠాలు చెబుతున్నారు. నేడు కాకపోతే, రేపైనా జీతం అందిస్తుందన్న ఉద్దేశంతో తమ బాధ్యతలను విస్మరించలేదు. తమను గెస్ట్ లెక్చరర్లుగా గుర్తించింది కాబట్టి జీతాలు విడుదల చేసే సమయంలో అన్యాయం చేయదని భావించారు. ఇప్పుడు అదే వారి కొంపముంచింది.జిల్లాలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల జాబితాలో కొంతమంది పేర్లు లేకపోవడంతో అవాక్కవటం వారి వంతయింది. ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందా? లేక ప్రభుత్వం కొంతమంది గెస్ట్ లెక్చరర్లకు మాత్రమే అనుమతినిచ్చిందా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత జిల్లా అధికారులు మాత్రం జీతాలు రాని గెస్ట్ లెక్చరర్లకు అన్యాయం జరగనివ్వబోమని, అందరికీ న్యాయం చేస్తామని చెబుతోంది. జిల్లావ్యాప్తంగా ఆయా జూనియర్ కళాశాలలో దాదాపు 34 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. సంబంధిత శాఖ విడుదల చేసిన జీతాల జాబితాలో వీరందరి పేర్లు లేకపోవడం గమనార్హం! ఇలా ఎందుకు జరిగిందనే విషయం పై భిన్న రకమైన వాదనలు వినిపిస్తున్నాయి. జాబితా రూపొందించే క్రమంలో సీనియర్ గెస్ట్ లెక్చరర్లను తొలి జాబితాలో, జూనియర్ గెస్ట్ లెక్చరర్లను మలి జాబితాలో చేర్చిందని తెలుస్తోంది. అందుకే మొదట విడుదలైన జీతం జాబితాలో అందరి పేర్లు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నట్లు సమాచారం.అధికారులు చెబుతున్న ప్రకారం జీతాలు అందుకున్న జాబితాలో సీనియర్ల పేర్లు ఉండాలి. కానీ జాబితా చూస్తే ఏడెనిమిది ఏళ్ల నుంచి బోధన చేస్తున్న వారి పేర్లు సైతం లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇక కొత్తగా మొదలైన జూనియర్ కళాశాలలో బోధనకు నియమితులైన గెస్ట్ లెక్చరర్ల పేర్లను కూడా మలి జాబితాలో చేర్చామని, అందుకే ప్రస్తుత జాబితాలో వీరి పేర్లు లేవని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన చూసుకున్నా, కొత్తగా ఏర్పడిన కళాశాలలో సైతం ఒకరి పేరు ఉండి మరొకరి పేరు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. మొత్తానికి అధికారుల నిర్లక్ష్యం వల్ల గెస్ట్ లెక్చరర్లు జీతాలు అందుకోకుండా నానా ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది వరకు 1654 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేసేవారు. ఆ తర్వాత ప్రభుత్వం 1256 జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేసింది. భర్తీ చేయగా మిగిలిన పోస్టులకు మాత్రమే గెస్ట్ లెక్చరర్లకు అనుమతిస్తామని నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా 398 మంది గెస్ట్ లెక్చరర్లు మాత్రమే ఈ ఏడాది మళ్లీ రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం దక్కించుకున్నారు. అయితే ప్రభుత్వం భర్తీ చేసిన పోస్టుల్లో కొన్ని సెకండ్ వేకెన్సీ, క్లియర్ వేకెన్సీల్లో సర్దుబాటు అవటంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 185 పోస్టులు పోస్టులకు ఖాళీ ఏర్పడింది. ఇక దీనికి తోడు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన కొత్త కళాశాలకు కూడా లెక్చరర్ల అవసరం ఏర్పడింది. దీంతో ఆయా కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల ద్వారానే బోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా బోధన చేయాలంటే మరో వెయ్యి గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అవకాశం ఇవ్వాలని సంబంధిత శాఖ కమిషనర్ ప్రభుత్వానికి తెలియజేశారు.అందుకు అంగీకరించని ప్రభుత్వం 398 మంది తోడు మరో 494 మంది గెస్ట్ లెక్చరర్లకు మాత్రమే అనుమతిని ఇచ్చింది. ఇందుకు ఇంటర్మీడియట్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు అంగీకారం తెలిపారు. జిల్లాలో ఉన్న గెస్ట్ లెక్చరర్లను 398 మందికి సంబంధించిన జాబితాలో, అలాగే 494 మందికి సంబంధించిన జాబితాలో చేరుస్తూ తమకు పంపించాలని సంబంధిత శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా అధికారులను ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికారులు జాబితా పంపించారు.

అంతకుముందు జిల్లాలో పనిచేసిన 70 మందికి గాను 34 మంది గెస్ట్ లెక్చరర్లు మాత్రమే అవకాశం దక్కించుకున్నారు. వీరే పాత, కొత్త కళాశాలల్లో సర్దుబాటు అయ్యారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో జాబితాను పంపే క్రమంలో సంబంధిత శాఖ జిల్లా అధికారులు ఎవరిని ఏ జాబితాలో చేర్చిందో తేలటం లేదు. దీనివల్ల పాత కళాశాలలో పనిచేసే వారు, కొత్త కళాశాలలో పనిచేసే వారు, జూనియర్లు, సీనియర్లు అనే తేడా లేకుండా జీతాలు అందుకునే వారి జాబితా గందరగోళంగా తయారయింది. దీంతో కొంతమంది జీతాలు అందుకోకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ జిల్లా అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం సాధారణంగా రెండు మూడు నెలలకు ఓసారి జీతాలను అందిస్తుంది. అలాగే గెస్ట్ లెక్చరర్లకు కూడా అందిస్తూ ఉండి ఉంటే, ప్రస్తుతం విడుదల చేసిన జీతం జాబితాలో తమ పేరు లేకపోయినా వీరంతా పెద్దగా అసహనానికి గురి అయ్యేవారు కాదు. గెస్ట్ లెక్చరర్లు దాదాపు పది నెలలుగా జీతాలు అందుకోవటం లేదు. వీరంతా జీతం ఎపుడు వస్తుందా? తమ ఇబ్బందులు, అప్పులు ఎపుడు తీరుతాయా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు.ఇలాంటి సమయంలో అసలు జాబితాలో తమ పేరే లేదని తెలిసి తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. కొంతమందికి ఇచ్చి తమకు ఎందుకు ఇవ్వటం లేదని, అసలు జాబితాను తప్పులతడకగా ఎందుకు రూపొందించారని? ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం అవకాశం కోల్పోయిన లెక్చరర్ల కోసం మరో జాబితాను తయారు చేస్తామని, తమ శాఖ కమిషనర్ కు వెంటనే పంపిస్తామని సంబంధిత జిల్లా అధికారులు చెబుతున్నారు.గతంలో పంపించిన జాబితాలోని వారికే ఇంకా జీతాలు అందలేదని, ఇక ఇప్పుడు తమ పేర్లను జత చేసి, జాబితాను రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తే వారి నుంచి ఆమోదం లభించేది ఎన్నడో, తమకు జీతాలు అందేది ఎపుడోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గెస్ట్ లెక్చరర్ల జీవితానికి ఉద్యోగ భద్రత ఉండదని, దీనికి తోడు అధికారులు, ప్రభుత్వ తీరు వల్ల తాము జీతానికి కూడా నోచుకుని పరిస్థితి ఏర్పడిందని వీరంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకొని తమ పేర్లను జాబితాలో చేర్చాలని, తమకు జీతాలు సక్రమంగా అందించాలని పేర్లు గల్లంతయిన గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారుహిస్టరీ లెక్చరర్ గా నాకు దాదాపు 9 ఏళ్ల అనుభవం ఉంది.

ప్రస్తుతం కూసుమంచి జూనియర్ కళాశాలలో బోధన చేస్తున్నాను. నేను పనిచేసిన ప్రతిచోట పూర్తి నిబద్ధతను చూపిస్తూ 100% ఫలితాలను రాబడుతున్నాను. జీతం లేని వేసవి రెండు నెలలు కూడా కళాశాల తరపున ప్రచారం చేస్తూ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు దోహద పడుతున్నాను. .


ఇక తొమ్మిది నెలల నుంచి జీతం కూడా అందుకోవటం లేదు. ప్రస్తుతం జీతం అందుకునే జాబితాలో నా పేరు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం మాలాంటి వారికి న్యాయం జరిగేలా చూసి వెంటనే జీతాలు అందించాలి.విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే ముందు సంబంధిత అధికారుల ఆమోదంతోనే బోధన చేసేందుకు రెన్యువల్ చేయించుకు న్నాను. అనుమానాల వ్యక్తం అవుతు న్నాయి. ఖాళీగా ఉండి నిరుద్యోగులుగా అనిపించు కోవడంకంటే, ఇలా ఉద్యోగం చేసుకుంటూ మా కాళ్ళ మీద మేము నిలబడుతున్నామని భావనలో ఉన్నాం. సంబంధిత శాఖ విడుదల చేసిన జాబితాలో మా పేరు లేకుండా ఉండటం చూస్తే మేము ఉద్యోగులమో, నిరుద్యోగులమో అర్థంకాని పరిస్థితి. మా లాంటివారికి అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదు. జరిగిన పొరపాటున సరిచేసి మాకు వెంటనే జీతాలు అందేలా చూడాలి.

# రూ.100 కోట్ల భూమి కబ్జా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ముగ్గురు అన్నదమ్ములు నకిలీ రికార్డులు సృష్టిం చారు. రూ. 100 కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా.. టీడీఆర్ రూపంలో రూ. 20 కోట్ల నష్టపరిహారం కూడా పొందారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలోని ఖాజాగూడ ప్రాంతం లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి ముగ్గురు అన్నదమ్ములు నకిలీ రికార్డులను సృష్టించి.. ఏకంగా రూ. 100 కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా నష్టపరిహారం కింద టీడీఆర్ (బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు) కూడా పొందిన భారీ కుంభకో ణం వెలుగులోకి వచ్చింది. ఈ భూ ఆక్రమణ కుట్ర ఖాజాగూడలోని సర్వే నంబర్ 25, 27 లను కేంద్రంగా జరిగింది. సర్వే నం. 25లో సిరిగాని మల్లయ్యకు చెందిన 2.23 ఎకరాల (103 గుంటలు) పట్టా భూమిని 1990లో కర్ణకోట చంద్రమ్మ కొనుగోలు చేశారు. 2000 సంవత్సరంలో చంద్రమ్మ, ఆమె కుమారులు గోపాల్, శంకర్, అనంతరాజు ఆ స్థలాన్ని ఒక స్థిరాస్తి సంస్థకు విక్రయించారు.అయితే.. ఆ స్థలానికి పక్కనే ఉన్న సర్వే నం. 27లో ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన కర్ణకోట సోదరులు, తాము విక్రయించిన భూమి పరిమాణానికి సరిసమానంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని తమ పేరుతో ఉన్నట్టుగా నకిలీ రికార్డులు సృష్టించారు. ఆ నకిలీ రికార్డులను ఉపయోగించి 2006లో ఆ స్థలాన్ని పీపీఆర్ యాదవ్, పీవీ రమణ యాదవ్, పీఎన్వీ వంశీధర్, ఎస్వీ సంజీవ రెడ్డిలకు విక్రయించారు. ఆ తర్వాత అందులోని కొంత భాగాన్ని (51 గుంటలు) వంశీధర్, సంజీవరెడ్డిల నుంచి తిరిగి ఆ ముగ్గురు సోదరులు కొనుగోలు చేశారు.ఆక్రమణదారుల దుశ్చర్య ఇక్కడితో ఆగలేదు. ఖాజాగూడ చెరువు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు అభివృద్ధి చేసిన 100 అడుగుల లింకు రోడ్డు ఈ ప్రభుత్వ భూమి మీదుగా వెళ్లింది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా తీసుకుని కర్ణకోట సోదరులు తమ ఆధీనంలో ఉన్నట్లు సృష్టించిన ఈ ప్రభుత్వ భూమికి నష్టపరిహారం డిమాండ్ చేశారు. బల్దియా (జీహెచ్ఎంసీ) అధికారులు లింకు డాక్యుమెంట్లను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే వారికి అనుకూలంగా వ్యవహరించి 2,611 గజాల స్థలానికి దాదాపు రూ. 20 కోట్ల విలువైన టీడీఆర్‌ను మంజూరు చేశారు.

# సినిమా..


## మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ..?






దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ - రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో రాజమౌళి బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ-స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు విషయాలపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

## రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రామాయణ





బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో ఒకటి రామాయణ దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతు న్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు-ఉత్సహంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్తగానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు

## వెంకటరమణ నేపథ్యమంతా విశాఖ!






విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రానికి సన్నాహాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. వెంకీ-గురూజీ మార్క్ చిత్రంగా మలుస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో వెంకటేష్ కున్న ఇ మేజ్ ఆధారంగానే త్రివిక్రమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనింగ్ కథను రాసినట్లు వినిపిస్తుంది. 'వెంకటరమణ' అనే టైటిల్ కూడా ఫిక్సైందని సమాచారం. ఈ కథ పూర్తిగా విశాఖపట్టణం నేపథ్యంలోనే సాగుతుందిట. విశాఖలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఓ 50 ఏళ్ల వ్యక్తి కథగా ఆవిష్కరిస్తున్నారట. కుటుంబ అనుంబంధాల నేపథ్యానికి త్రివిక్రమ్ మార్క్ హాస్యాన్ని జోడించి సిద్ధం చేసిన స్క్రిప్ట్ అని తెలిసింది. విశాఖ-అనకాపల్లి ప్రాంతాలతో తనకున్న అనుబంధాన్ని గురూజీ ఈ కథలో హైలైట్ చేయబోయ బోతున్నారట. త్రివిక్రమ్ అంటే బలమైన డైలాగులు...బంధాలు.. భావోద్వేగంతో కథను నడిపించ గల దిట్ట. ఇలాంటి కథలు రాయడం కొట్టిన పిండి. 'అతడు', ' అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అఆ', 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో' లాంటి చిత్రాల్లో ఎమోషన్ పాతతే అయినా తనదైన ట్రీట్ మెంట్ తో రక్తి కట్టించారు. వాటిలో హాస్యం అంతే పండుతుంది. అలాంటి డైరెక్టర్ కి వెంకీ లాంటి కామెడీ టింజ్ ఉన్న నటుడు తోడైతే? ఎమోషన్ తో పాటు, హాస్యానికి ఛాన్స్ ఉంటుంది. వెంకటరమణనిఈ పాయింట్ ఆధారంగానే రాసినట్లు సన్నిహితుల సమాచారం. ఇప్పటికే ఇద్దరి కాంబినేషన్ లో 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' లాంటి సినిమాలు తెరకెక్కిన సంగతి తెలిసిందే. అయితే ఈ రెండింటికీ డైరెక్టర్ వేరైనా రైటర్ గా పనిచేసింది త్రివిక్రమ్. వెంకీ శైలి..ఇమేజ్ ఆధారంగా తయారైన కథలవి. 'మల్లీశ్వరి' కూడా వైజాగ్ నేపథ్యంలో సాగిన చిత్రమే.

## మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు...




సోషల్ మీడియాలో తరచుగా సెలబ్రిటీలపై ట్రోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ట్రోలింగ్‌లు, ప్రతికూల వ్యాఖ్యలపై నటీనటులు అప్పుడప్పుడు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తునే ఉన్నారు. తాజాగా ఈ విషయంలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో వచ్చే అనవసర విమర్శలపై రకుల్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించింది. రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియా ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. దురదృష్టవశాత్తూ, మన దేశంలో చాలా మందికి ఎలాంటి పనిలేదు. వారందరికీ ఉచిత డేటా ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల, ఇతరుల జీవితాల గురించి కామెంట్స్ చేయడం తప్ప వారికి ఇంకేమీ పనిలేకుండా పోయింది" అని అన్నారు. కాగా రకుల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.మరోవైపు రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న వేధింపులు, ట్రోలింగ్‌కు అద్దం పడుతున్నాయి. ఉచిత డేటా ప్లాన్‌ల లభ్యత, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం వల్ల ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు సులభంగా చేరువయ్యారని, అయితే దీనిని దుర్వినియోగం చేసే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆమె పరోక్షంగా అభిప్రాయపడ్డారు.

## లిప్ లాక్ సన్నివేశాలపై నిధి అగర్వాల్ క్రేజీ కామెంట్స్



కొన్ని నెలల క్రితం హీరో చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నిధి అగర్వాల్, తాజాగా పవన్ కళ్యాణ్‌తో కలిసి 'హరిహర వీరమల్లు' చిత్రం చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రంతో తెలుగు సినిమా ప్రేక్షకులని అలరించేందుకు సిద్ధమైంది. 2022 తర్వాత నిధి నటించిన తొలి తెలుగు సినిమా హరిహర వీరమల్లు సినిమా కావడం విశేషం. ఈ సినిమాను ఏఎం రత్నం భారీ బడ్జెట్‌తో నిర్మించగా, క్రిష్ జాగర్లమూడి & జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. జూలై 24న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. నిధి అగర్వాల్ ఈ సినిమా కోసం ఐదేళ్లు వేచిచూసింది. ప్రస్తుతం ప్రమోషన్ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొంటోంది. ఈ చిత్రంలో తన పాత్రకు న్యాయం చేయడానికి ఆమె భరతనాట్యం, గుర్రపు స్వారీ వంటి ప్రత్యేక శిక్షణలు తీసుకుంది. సినిమాలో ఒక ముఖ్యమైన సన్నివేశం భరతనాట్య నేపథ్యంతో ఉంటుందని, అలాగే తన పాత్రలో ఊహించని ట్విస్ట్ ఉందని నిధి వెల్లడించింది. మాస్ హీరోయిన్ కావాలని ఉంది కానీ నా హద్దులు నాకు తెలుసు అంటూ నిధి ఓ స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ, తనకు మాస్ హీరోయిన్‌గా గుర్తింపు రావాలని ఉందని చెప్పింది. అయితే యాంకర్ అడిగిన ప్రశ్నకు ఆమె సూటిగా సమాధానం ఇచ్చింది.మాస్ ఇమేజ్ రావాలంటే బికినీ, లిప్‌లాక్, ఇంటిమేట్ సన్నివేశాలుచేయాల్సి ఉంటుందికదా?" అని అడగ్గా, దానికి నిధి స్పందిస్తూ.. అలాంటివి నేను చేయను. నా హద్దులు నాకు తెలుసు. నేను తల్లిదండ్రులతో కలిసి చూడలేని సన్నివేశాల్లో నటించను. అలాంటి సన్నివేశాలు చేయకపోయినా మాస్ హీరోయిన్ అవ్వొచ్చు. కష్టపడి పనిచేస్తాను, మంచి కథలు ఎంచుకోవడానికి ప్రయత్నిస్తాను అని పేర్కొంది. నిధి అగర్వాల్ 'హరిహర వీరమల్లు' కోసం ఎంతగా కష్టపడిందో సినిమా చూస్తే అర్థమవుతుంది.

## మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభిం చారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215